రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జమలాపురం రామకృష్ణ

**మాడ్గుల ఆగస్టు 21 ప్రభాతవార్త** రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన జమలాపురం రామకృష్ణ జీ బుధవారం బిజెవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో భారతీయ జనతా పార్టీ యువజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు ఆయన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన జాతీయ బిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారికి ప్రత్యేక కృతజ్ఞ తలు తెలిపారు. ఉస్మానియా యూనివర్శిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమకారుడిగా పనిచేయడంపట్ల బిజెవైఎం రాష్ట్ర నాయకత్వం తనను గుర్తించిందని ఈ సందర్భంగా అన్నారు.



ఆచారికి కృతజ్ఞతలు తెలుపుతున్న రామకృష్ణ

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేత



**ఘట్‌కేసర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామానికి చెందిన ఇద్దరికి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. ఎదులాబాద్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల పొన్నమ్మకు రూ.30,000, గోస్కొండ మహేశ్ యాదవ్‌కు రూ.21,000లు సీఎం సహాయ నిధి నుంచి మంజూరు కాగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇచ్చారు. ఇద్దరు కూడా అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా ఆర్థికసాయం కోసం సీఎం ఆర్‌ఎఫ్‌కు ధరఖాస్తు చేసుకోగా మంజూరు కావడంతో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే మల్లారెడ్డి చెక్కులను అందించారు.సహకార సంఘం డైరక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి, మాజీ వార్డుసభ్యులు ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు ఎర్రోళ్ల సుదర్శన్, వేముల శరత్‌గౌడ్, ఆశీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

## అన్ని హంగులతో ప్రభుత్వ వైద్య కళాశాల భవనం : స్పీకర్ ప్రసాద్‌కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** అన్ని సౌకర్యాలతో, అన్ని హంగులతో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణం చేపట్టనున్నట్లు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్మించే ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంఖుస్థాపన భూమి చేసి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, వైద్య కళాశాల భవన నిర్మాణం 30 ఎకరాలలో నిర్మించేందుకు చేపట్టేందుకు రూ.235 కోట్లతో వివిధ భవన సముదాయములు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. మంజూరు అయిన నిధులతో ప్రిన్సిపల్, ఆర్ఎంఓ, సూపరిండెంట్ క్వార్టర్లతో పాటు వైద్య విద్యార్థుల వసతి గృహాలను నిర్మించున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైద్య కళాశాల ఏర్పాటుతో జిల్లాలోని ప్రజలందరికి మెరుగైన వైద్యం అందనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్‌పర్సన్ శంషాద్‌బేగం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, కూన్సిలర్ మురళి, ఆర్అండ్‌బీ ఎస్ఇ వసంతనాయక్, ఆర్అం డ్‌బీ ఇఇ శ్రీధర్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపల్ పద్మ, ఆర్డిఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## 451 పాఠశాలల్లో పనులు పూర్తి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు ప్రారంభించబడిన 966 పాఠశాలలో 451 పాఠశాలలో పనులు పూర్తి చేసుకోబడినవని ఇందుకు ఎంపిడివోలు ,మండల స్పెషల్ ఆఫీసర్స్ ,స్క్రూటిని ఆఫీసర్స్ ద్వారా పరిశీలన జరిగిన తర్వాత 4 కోట్ల 41 లక్షల, 52 వేల 751 రూపాయలు డైరెక్ట్‌గా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్‌లో జయ చేయబడతాయని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఓ ప్రటనలో తెలిపారు.అయితే పాఠశాలలన్నింటికి 25శాతం నిధులు పనులు ప్రారంభించక ముందే మంజూరు చేయడం జరిగిందని ప్రస్తుతం మిగిలిన 75శాతం నిధులను కూడా ఈరోజు మంజూరు చేసినట్లు తెలిపారు.

## ఆఫీసుల్లో హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

ఎల్‌ఆర్‌ఎస్‌పై ధరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయటానికి జిల్లా కలెక్టరేట్‌లో, ఎంపిడిఓ ఆఫీస్‌ల్లో, మున్సిపల్ ఆఫీస్‌ల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్త ఆదేశించారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ధరఖాస్తులు చేసుకున్న వారి సందేహాలు తీర్చటానికి,నివృత్తి చేయటానికి జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, మండల స్థాయిలో ఎంపిడిఓ ఆఫీస్‌ల్లో, మున్సిపల్ స్థాయిల్లో మున్సిపల్ ఆఫీస్‌ల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్‌డెస్క్‌లలో సంప్రదించి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. గతంలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం ధరఖాస్తులు చేసుకున్న వారు అవసరమైన మేరకు డాక్యుమెంట్స్ ఇవ్వని పక్షంలో ఇపుడు తీసుకుని ఎల్‌ఆర్‌ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆప్ (ఎపిపి)లో అప్లోడ్ చేయాలని సూచించారు. అవసరమైన మేరకు రుసుం చెల్లించి ధరఖాస్తులు చేసుకోవాలని జిల్లా అదనపు కలెకర్ రాధికాగుప్తా సూచించారు.

## యాదగిరీశుని సేవలో ఎమ్మెల్యే కుటుంబం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఆగస్టు 21) :** షాద్‌గనర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ యాదగిరి లక్ష్మీ నరసింహ్మా స్వామిని బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. యాదగిరి గుట్టకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, అనురాధ దంపతులు తదితర కుటుంబ సభ్యులతో పాటు ఆ యాదగిరిశున్ని దర్శనం చేసుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ నిర్వాహకులు అర్చక పూజారులు, సిబ్బంది ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు స్వామి ఆశీర్వచనాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడుతూ.. లక్ష్మీ నరసింహ్మా స్వామి కటాక్షంతో నియోజకవర్గ ప్రజలు అదేవిధంగా తెలలం గాణ రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో వర్థిల్లాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఎంతో మహిమాన్వితం కలిగిన యాదగిరి గుట్టపై వెలసిన శ్రీ లక్ష్మీ సహిత నరసింహస్వామిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని అన్నారు. స్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకోవడం జరిగిందని, ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన ఎంతో బ్రహ్మాండంగా కొనసాగుతుందని, పేద ప్రజలకు పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చడంతో పాటు మౌలిక సదుపాయాల రూపకల్పనకు ప్రాధాన్యతను ఇస్తూ విద్యా వైద్యం ఉపాధి తదితర సంక్షేమ అభివృద్ధి ఫలాలను అందించడంలో ముందున్నారని అన్నారు. గెలిచిన అతికొద్ది కాలంలోనే ప్రజల మనసును దోచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం దశలవారిగా అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టబోతున్నారని అన్నారు. లక్ష్మీ నరసింహుని ఆశీస్సులతో సకాలంలో వర్షాలు కురిసి ప్రజలందరూ సుభిక్షంగా వ్యవసాయం సస్యశ్యామలంగా ఉండాలని ఆ దేవున్ని కోరుకున్నట్లు చెప్పారు.



యాదగిరిగుట్టలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే శంకర్

# వారంలోగా చెరువుల సర్వే పూర్తి చేయాలి

### కలెక్టర్ శశాంక్ సంబంధిత అధికారులకు ఆదేశాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

**మాడ్గుల ఆగస్టు 21 ప్రభాతవార్త** జిల్లాలోని చెరువుల సర్వేను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధింత అధికారులన ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యా లయాల సముదాయ భవనంలోని సమావేశం మందిరంలో కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్‌తో కలిసి ఆర్డీఓ లు ఇరిగేషన్ అధికారులు హెచ్‌ఎమ్‌డిఏ నోడల్ అధికారులతో చెరువుల సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 1075 చెరువులు ఉండగా 945 చెరువుల సర్వే పూర్తి చేయడం జరిగిందని ఇంకా 38 చెరువల సర్వే చేయవలసి ఉందని తెలిపారు. వారంలోగా చెరువుల సర్వే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రెవెన్యూ అధికారులు గ్రామ నాక్షాలను ఫహానీలను ఈసుకుని క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఇరిగేషన్ అదికారులు జాయింట్ సర్వే నిర్వ హించి ఎఫ్‌టీఐలను బఫర్లను గుర్తిస్తూ కడీలను సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించే సమయంలో ఆయా చెరువులకు సబంధించిన మ్యాపులను తీసుకుని వెళ్లి పరిశీలించాలన్నారు. తొలుత క్షేత్ర స్థాయిలో మండల స్థాయికి తహాసీల్దార్లు ఇరిగేషన్ ఏఈలు సంయుక్తంగా తమ పరిధిలోని చెరువులను పరిశీలించి డివిజన్ స్థాయికి నివేధికలు పంపాలని, ఫైనల్ సర్వేనిర్వహించి వెంటనే ఆయా చెరువుల నివేదికలను హెచ్ఎండీఏకు పంపించాల న్నారు. జిల్లాలో అక్రమణలకు రియల్టర్ల కబ్జాలకు గురికాకుండా గట్టి నివారణ చర్యలు చేపట్టడం తోపాటు ఎక్కడైన చెరువులు కబ్జాలకు గురవుతున్నట్లు సమాచారం అందితే వెంటను స్పందించి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆర్డీవోలు సూరజ్ కుమార్ అనంతరెడ్డి వెంకట్‌రెడ్డి సాయిరాం వేనుమాధవ్ ఇరిగేషన్ డీఈ నరేందర్‌రెడ్డి హెచ్ఎండీఏ నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

### అడిషనల్ కలెక్టర్ సుధీర్



పనులపై ఆరా తీస్తున్న అడిషనల్ కలెక్టర్

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ కలెక్టర్‌సుధీర్ అన్నారు. బుదవారం పెద్దేముల్ మండలం తట్టెపల్లిలోని జడ్‌పిహెచ్‌ఎస్, యుపిఎస్, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడి పాఠశాలను అడిషనల్ కలెక్టర్ సందర్శించారు.నిర్మాణంలో ఉన్న హెల్త్ సబ్ సెంటర్ భవనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులనాణ్యతను పరిశీలించి పనుల పురోగతిపై సంబందిత డిఈ, ఏఈ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి సభ్యులతో మాట్లాడి విషయాలను తెలుసుకున్నారు.ఈ సందర్బంగా అడిషనల్ కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చె వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యాభోధనను అందించాలని ఉపాద్యాయులకు సూచించారు. పాఠశాలలో ప్యాన్స్, లైట్లు ఉండే విధంగా చూడాలని అన్నారు. మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేటట్లు చర్యలు తీసుకోవాలని అన్నారు. విధులపట్ల నిర్లక్షం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఓ శంకర్ నాయక్, యంపిడిఓ జర్నప్ప, యంపిఓ రతన్‌సింగ్, పిఆర్‌డిఈ, ఏఈ, అంగన్‌వాడి సిడిపిఓ, సూపర్‌వైజర్స్,మాజీ యంపిటిసి శంకర్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కొండపురం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఋణమాఫీ అమలులో జాప్యాన్ని నివారించాలి

### సొసైటీ అధికారికి రైతుల వినతి

**ఘట్‌కేసర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతు ఋణమాఫీ చేస్తున్నామని చెబుతున్నా అమలు కావడంలో ఎందుకు జాప్యం జరుగుతుందని రైతులు అధికారులను నిలదీశారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం కార్యాలయానికి ఎదులాబాద్ గ్రామానికి చెందిన రైతులు చేరుకొని ఋణమాఫీపై తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట్‌రాం రెడ్డి, ఘట్‌కేసర్ మండల వ్యవసాయాధికారి ఎం.ఎ.బాసిత్‌లు రైతులతో చర్చించి ఋణమాఫీ అమలు జరుగుతున్న తీరు, బ్యాంకర్లకు ఎదురవుతున్న సమస్యలు, ఆడిటింగ్, రైతుల ఖాతాల్లో చేస్తున్న సవరణలపై వివరించారు. ఇతర బ్యాంకుల మాధిరిగా కాకుండా సొసైటీ ఖాతాలు ఆన్‌లైన్ కాకపోవడంతో అధికారులు ఆడిటింగ్ చేసి నివేదిక ఇచ్చారని, వాణిజ్య, జాతీయ బ్యాంకులలలో ఋణాలు తీసుకున్న రైతులకు మాఫీ త్వరగా వస్తుందని తెలిపారు. సొసైటీ నుంచి పంట ఋణాలు పొందిన దాదాపు 1,200 మంది రైతులు ఋణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని ఇతర మండలాల్లో ఋణ ఖాతాలో మాఫీ డబ్బులు జమ చేశారని ఇక్కడ మాత్రం కావడం లేదని వ్యవసాయాధికారుల మందు వాపోయారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా శాఖల అధికారులు ఆడిటింగ్ చేసి ఋణాలు పొందిన రైతుల జాబితాను పంపించారని త్వరలో ఋణమాఫీ డబ్బులు వస్తాయని వారు తెలియజేశారు. అనంతరం మేనేజర్ రత్న జయప్రకాష్‌కు రైతులు వినతి పత్రం అందజేసి ఋణమాఫీ త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ డైరక్టర్ కొమిరెడ్డి ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ డైరక్టర్లు గాయరు విశ్వనాథం, జవాజీ సత్తయ్య, మాజీ ఎంపిటిసి గట్టగళ్ల రవి, నాయకులు సామల అమరేందర్, ఓంప్రకాష్, రాచకట్ల నర్సింహ్మా, బొంత రాజిరెడ్డి, గూడెం అంజనేయులు, బస్వయ్య, లక్ష్మణ్, భర్తక్ సురేశ్, గ్యార విశ్వనాథ్, బలరాం, నాగేశ్, వెంకటేశ్, శ్రీను, పూస నర్సింహ్మా, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్ సొసైటీలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎదులాబాద్ రైతులు

# ఇదేం దౌర్జన్యం...?

**ఆర్టీసీ వ్యాపార సముదాయ దుకాణాలకు అధికారుల తాళాలు**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదేశాలను అధికారులు బేఖాతర్**
**ఉన్నతాధికారుల ఆదేశాలు మాకు అందలేదు : డిపో మేనేజర్ ఉష**

**షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 21, (ప్రభాతవార్త) :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ప్రభుత్వ ఆర్టీసీ వ్యాపార సముదాయ దుకాణాలకు అధికారులు బలవంతంగా తాళాలు వేశారు. ఉన్నఫలంగా షటర్లకు తాళాలు వేసి మీ దిక్కున చోట చెప్పుకోమంటు ఏకంగా దౌర్జన్యానికి దిగుతున్నారంటూ బాధితులు వాపోతున్నారు. గత కోవిడ్ 19 సందర్భంగా ఏడాది పాటు ఎలాంటి వ్యాపారాలు లేకుండా ముగిసిన గత కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ శాఖ ఎం.డి. సజ్జనార్ ఒక సంవత్సరం గడువును పెంచుతున్నట్లు అప్పట్లో ప్రకటించారని బాధితులు తెలిపారు. అయితే ప్రస్తుతం షాద్‌నగర్ డిపోలో అద్దె భవనాల సమయం మించిపోయింది. ఆర్టీసీ వ్యాపార సముదాయాలకు అద్దె పెంచి వ్వాలని లేకపోతే ఖాళీచేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను వ్యాపార సముదాయాలకు సంబంధించిన వ్యాపారస్తులు కలుసుకొని తమ గోడు వెళ్ళబోసుకున్నారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ విషయాన్ని ఎమ్మెల్యేతో పాటు పలువురు స్థానికులు ఆయన స్థానిక అధికారుకుల సైతం ఈ విషయాన్ని చెప్పి వారి పరిస్థితి సమీక్షించాలని చెప్పారు. అయితే ఇవేవి పట్టించుకోకుండా ఇప్పుడు ఉన్నఫలంగా షాపులకు తాళాలు వేయడంఓ వ్యాపారస్తులు లబోదిబో మంటున్నారు. తమ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చెప్పిన కూడా అధికారులు వినరా...? అని నిలదీస్తున్నారు. ఏడాదికి పైగా ఎంతో నష్టపో యి వ్యాపార పరంగా అనేక నష్టాలు చవిచూసిన తమకు ఆదుకోవాల్సింది పోయి అద్దె పెంచాలని తమపై ఒత్తిడి తెచ్చి బలవంతంగా నోటీసులు అంటించి ఇప్పుడు దుకాణాలకు తాళాలు వేయడం ఇది న్యాయం కాదని బాధితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఉన్నఫలంగా తమ బతుకులు రోడ్డున వేయొద్దని విన్నవిస్తున్నారు. ఈ విషయమై షాద్‌నగర్ డిపో మేనేజర్ ఉషాను మీడియా వివరణ కోరగా ఆమె మాట్లాడుతూ దీనిపై తమకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదని అందుకే తమ పని తాము నిబంధనల ప్రకారం చేసుకుపోతున్నట్లు తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఆర్టీసీ షాపుల యజమానులు



షాపులకు నోటీసులు అంటించి,తాళాలు వేసిన ఆర్టీసీ అధికారులు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేస్తున్న బిజెపి నాయకులు

## అక్రమ కట్టడాలపై హైడ్రాకు బిజెపి నాయకుల ఫిర్యాదు

**శంషాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త** శంషాబాద్‌లోని పలు చెరువులలో కాలువలపై ప్రభుత్వ దేవాదాయ శాఖ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని శంషాబాద్ భారతీయ జనతాపార్టీ నాయకులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. దేవేందర్ కొండ పరమేష్ గౌడ్ రాజిరెడ్డి సురేందర్ కొలను ప్రదీప్‌రెడ్డి కొలను జగ్జీవన్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి విజయ భాస్కర్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి జనార్దన్ రెడ్డి తదితరులు బుధవారం హైడ్రా కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. శంషాబాద్ పట్టణ నడిబొడ్డులోని రాళ్లగూడ దోషికుంటలో చెరువును ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని కాముని చెరువు సమీపంలో కాల్వపై పెద్ద ఎత్తున నిర్మాణాలు జరు గుతున్నాయని శాతంరాయిలోని యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని వారు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదు అందుకున్న రంగనాథ్ వెంటనే శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు ఫోన్‌చేసి వివరాలు అడిగినట్లు బిజెపి నాయకులు తెలిపారు. వెంటనే కబ్జాలకు సంబంధించిన పూర్తి వివరాలు తనకు అందజేయాలని ఆయన ఆదేశించినట్లు తెలపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలిసి బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు.

## ఎన్‌హెచ్ రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

### అధికారులకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గౌతమ్, ఎన్‌హెచ్ఎఐ పిడి శ్రీనివాస్‌రావు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 21, ప్రభాతవార్త**

బోయినిపల్లి నుంచి మేడ్చల్ వరకు ఎన్‌హెచ్-44రోడ్డు వెడల్పు (ఆరులైన్ల) నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సుమారు వెయ్యి కోట్ల రూపాయలతో జరుగుతున్న రోడ్డు విస్తరణ నిర్మాణ పనులను త్వరగా పూర్తి జరిగేలా చూడాలని ఆయన అన్నారు. బుధవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ గౌతమ్ సమీక్షించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జాతీయ రహదారి ఎన్‌హెచ్-44రోడ్డు విస్తరణలో భాగంగ బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు వెయ్యి కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు విస్తీర్ణ పనులలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటానికి సంబంధిత శాఖల అధికారులు సహకరించి నిర్మాణ పనులు త్వరగా పూర్తి జరిగేలా చూడాలని అన్నారు. ఆరు లైన్ల రోడ్డు నిర్మాణ పనులపై ఈ రోడ్డు ప్రాజెక్టు డైరక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు విస్తీర్ణంలో గల ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌ను కలెక్టర్ ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న పెట్రోల్‌బంకు అనుమతులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారికి సూచించారు. అండర్ పాస్ స్లిప్ రోడ్డు పనులు, విద్యుత్ టవర్స్ డ్రైన్‌లు, పైప్‌లైన్ పనులకు ఆటంకం కలుగకుండ సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. త్వరగా ఇతర స్థలాల్లో అవార్డులు క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాల్సిందిగా, మ్యుటేషన్ చెల్లింపు జరిగిన స్థలాలు అప్పగించుటకై సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, ఎన్.హెచ్.ఎ.ఐ ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్డీఓలు ఉపేందర్, శ్యాంప్రకాశ్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువు (మినిట్యాంక్‌బండ్)ను పరిశీలిస్తున్న మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ, మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్

## వినాయక నిమజ్జనానికి డీసీపీ చెరువు పరిశీలన

**ఘట్‌కేసర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ఆయా శాఖల సమన్వయంతో నిర్వహించాలీ ్న ఉంటుందని మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లోని లక్ష్మీనారాయణచెరువు (మినిట్యాక్‌బండ్)ను పరిశీలించారు. రాచకొండ పరిధిలో నెలకొల్పే గణేశ్ విగ్రహాలు వినాయక ఉత్సవాల అనంతరం ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో పెద్ద సంఖ్యలో నిమజ్జనం చేసే అవకాశం ఉందని ఆమె తెలిపారు. చెరువు వద్ద అవసరమైన నిమజ్జన ఏర్పాట్లపై ఆమె ప్రజాప్రతినిదులు, అధికారులతో చర్చించారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల ద్వారా చెరువుకట్టపై క్రేన్లు, ఇతర సౌకర్యాలు కల్పించాలని ఆమె కోరారు. ప్రతి సంవత్సరం కూడా మున్సిపాలిటీ నుంచి నిమజ్జనానికి తమ సహకారం అందిస్తున్నామని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనియాదవ్ తెలిపారు. మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల కమీషనర్లు ఎండి.సాబేర్‌ఆలీ, పి.వేమనారెడ్డి, ఘట్‌కేసర్, పోచారం ఐటీసీల ఇన్‌స్పెక్టర్లు ఎస్.సైదులు, బి.రాజువర్మ, నాయబ్ తహాశీల్దార్ రాజేందర్, రెవెనూ ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగా మహా సంగ్రామ్ 2024లో మెరిసిన చిన్నారులు



యోగా విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసం కార్యాలయంలో ఎస్.ఎస్.డి యోగా స్టూడియో గురువు మల్లేష్, యోగా బ్రదర్స్ పూర్ణ, విజయ్‌లు గత నెల 27,28లలో యోగసన ఫెడరేషన్ ఆఫ్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా మహా సంగ్రామ్ 2024లో పతకాలు సాధించిన విద్యార్థులతో కలిసి బుధవారం ఎమ్మెల్యే కేపీ వివేకానందని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగ యోగా మహాసంగ్రామ్‌లో ఐదు బంగారు పతకాలు, నాలుగు రజత పతకాలు, రెండు సిల్వర్ పతకాలతో సత్తా చాటిన కుత్బుల్లాపూర్‌కు చెందిదిన యోగా విద్యార్థులను ఎమ్మెల్యే వివేకానంద అభినందించారు. అదేవిధంగా తమ శిక్షణతో పిల్లలను యోగాలో నిష్ణాతులుగా తయారు చేస్తున్న ఎస్.ఎస్.డి. యోగా స్టూడియో కోచ్ విజయ్ కుమార్ బెస్ట్ కోచ్‌గా నిలిచారు. అనంతరం ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ పిల్లలు మానసికంగా దృఢత్వం పొందుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో యోగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షణ పొందుతున్న పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణను సిఎం రేవంత్‌రెడ్డి చేపట్టాలి



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ప్రదర్శన నిర్వహిస్తున్న మాదిగ, మాదిగ ఉప కులాలు

**సైఫాబాద్, ఆగస్టు 21 ప్రభాతవార్త:**
ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే వర్గీకరణ చేపట్టాలని కోరుతూ అనేక మంది మాదిగ, మాదిగ ఉపకులాలు బుధవారం బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్యమాదిగ, ఉప కులాల ఐక్యవేదిక ఛైర్మన్ తూర్పాటి హనుమంతుతో కలిసి మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వగానే సిఎం అసెంబ్లీలో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే ఆర్డినెన్స్ తీసుకువచ్చి మాదిగ, మాదిగ ఉపకులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్‌లు అమలు చేయాలని కోరారు. ఆది ఆంధ్రా, తెలంగాణ మాలలు వర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ పిలుపు ఇవ్వడం సిగ్గుచేటని, మాలలు బంద్‌ల పేరిట ఆందోళనలు చేపడితే సహించేది లేదని అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. మాలలు బలిసి కొట్టుకుంటున్నారని ఆయన ధ్వజమెత్తారు. వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు అన్ని రంగాలలో మాలలే ఎస్సీ రిజర్వేషన్ ఫలితాలను అనుభవించారని, మాదిగ, మాదిగ ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పుపై తిరిగి మాలలు కోర్టు కేసు వేసినా ఏలాంటి ఫలితం లేదని స్పష్టం చేశారు. ఎస్సీల సంక్షేమానికి, అభివృద్ధికి మాదిగలతో మాలలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## యూజీ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

**అత్తాపూర్ ఆగస్టు21,ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం,పీవి నరిసింహా రావు వెటర్నరీ విశ్వవిద్యాలయం,శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయాల్లో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదిని ఈనెల 29 వరకు పొడిగించారు. విద్యార్థులు,వారి తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బైపిసి స్ట్రీమ్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునే తేదిని పెంచినట్లు జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్.పి. రఘురామిరెడ్డి తెలిపారు.జూలై 12వ తేది నుంచి ఆగస్టు 17వ తేది వరకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.తొలి విడతలో దరఖాసునత చేసుకొని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రిజిస్ట్రార్ సూచించారు.పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలి



**అత్తాపూర్ ఆగస్టు21,ప్రభాతవార్త :**
కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సుప్రీంకోర్టు వెంటనే ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించి రద్దు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు.బుధవారం భారత్‌బంద్‌లో భాగంగా అంబేద్కర్ యువజన సంఘం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దళిత సంఘాల నాయకులు చేరి ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం కొన్ని దుకాణాలు, ప్రభుత్వ పాఠశాలలను సైతం మూసి వేయించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ....ఎస్సీ వర్గీకరణపై పునారాలోచించాలని మాల సామాజీక వర్గానికి న్యాయం జరిగేవిధంగా ఉండాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఎస్సిఆర్‌పి సొసైటీ డిస్టిక్ ప్రెసిడెంట్ రమేష్,అంబేద్కర్ సంఘం ప్రెసిడెంట్ గొడుగు సంజీవ, జయంతి కమిటీ చైర్మన్ పచ్చ నర్సింగ్ రావు,బిఎస్పీ నాయకులు పచ్చ,అనిత,జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షుడు పంబల రాజు,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్టేట్ సెక్రటరీ రమేష్,అంబేద్కర్ సంఘం జనరల్ సెక్రెటరీ జంగయ్య,ప్రసాద్,సన్నీ,నందు,అజయ్,పాల్గొన్నారు.

## డిజిపి జితేందర్‌ను కలిసిన మేయర్ లతాగౌడ్

**నార్సింగి, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
తెలంగాణ పోలీసు అకాడమికి వచ్చిన డిజిపి జితేందర్‌ను బుధవారం బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. డిజిపికి పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అకాడమిలో భూగర్భ డ్రైనేజి నిర్మాణం కోసం కార్పోరేషన్ నుంచి రూ.36.లక్షల నిధులు మంజూరు చేశామని, ఇందులో భాగంగా డిజిపిని కలిశామని లతాగౌడ్ తెలిపారు. ఈ పనులను త్వరలోనే పూర్తి చేసి పోలీసు అధికారులకు ఇబ్బందులు దూరం చేస్తామన్నారు. సమాజంలో 24.గంటలు విధులు నిర్వహిస్తున్న ఏకైక విభాగం పోలీసు విభాగమని, అలాంటి పోలీసు విభాగం హెడ్ క్వార్టర్‌లో భూగర్భ డ్రైనేజి సమస్యను వేగంగా పరిష్కరిస్తామన్నారు.

# వినూత్న గతులు జతులతో సందీప్ పేరిణి నాట్యపదం

-రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ



పేరిణి నాట్యపదంలో ఒక దృశ్యం

**రవీంద్రభారతి, ఆగస్టు 21 ప్రభాతవార్త :**
వినూత్న విభిన్న గతులు జతులతో యువ పేరిణి నాట్య కళాకారుడు, గురువు సందీప్ పేరిణి నాట్యపదంగా రూపొందించిన తాను, శిష్యబృందంచే మైలురాయిగా నిలిచే ప్రదర్శన కావించారని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ తెలిపారు. మొదటి సారిగా పేరిణి కళారూపం నాట్యకళకి జాతీయస్థాయిలో కేంద్ర సంగీత నాటక అకాడమీ ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారాన్ని పేరిణి రాజ్‌కుమార్‌కు, పేరిణి నృత్యాన్ని జాతీయస్థాయిలో గుర్తిస్తూ పేరిణి ప్రకాష్‌కు కేంద్ర సంగీత నాటక అకాడమీ సీనియర్ పురస్కారాన్ని 2024లో ప్రకటించిందని విపులీకరించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, న్యూయార్క్ తెలంగాణ తెలుగు అసోసియేషన్, శ్రీ మణిద్వీప ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ప్రముఖ పేరిణి నాట్యగురువు, యువ కళాకారుడు సందీప్ బృందంచే ప్రదర్శింపబడిన పేరిణి నాట్యపదం విచ్చేసిన అశేష వీక్షకులకు, ఔత్సాహిక ప్రేక్షకులను గగుర్పొల్పింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్రప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, ప్రముఖ పేరిణి నాట్యగురువు పవన్‌కుమార్, కృష్ణప్రదీప్, ప్రవీణ, సంతోష్, రవితేజ, సందీప్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాశనంచేసి యువపేరిణినాట్య గురువు సందీప్ నేతృత్వంలో ప్రఖ్యాత నాట్యకళ పేరిణికి సంబంధించిన వైవిధ్యభరితమైన మైలురాయిగా నిలిచే పేరిణి నాట్యపదం ప్రదర్శనను లాంఛనంగా ప్రారంభించి ఈతరం నటరాజ రామకృష్ణ పేరిణి సందీప్ అని కొనియాడారు. చివరిగా ఎంపికచేసిన పేరిణి కళాకారులను ఘనంగా సత్కరించి పేరిణియోధ పురస్కారాలను ప్రదానంచేపి ఎంతగానో అభినందించి శుభాశీస్సులందజేశారు.

## ఎస్సీ వర్గీకరణకు సిఎం ఆర్డినెన్స్ జారీ చేయాలి

**సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణపై సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే ఆర్డినెన్స్‌ను జారీ చేసి అణగారిన మాదిగ, మాదిగ ఉపకులాలకు, మాల, మాల ఉపకులాలకు రిజర్వేషన్ ఫలాలు అందజేయాలని నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ జాతీయ అధ్యక్షుడు గడిప నాగయ్య, ప్రధాన కార్యదర్శి తుంగునూరి బాలరాజు, కోశాధికారి బోగారపు వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టులో వర్గీకరణపై విజయం సాధించిన ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, తక్షణమే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన సిఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలియజేశారు. సిఎం వర్గీకరణ చేయకపోతే పెద్ద ఎత్తున తిరిగి పోరాటం చేస్తామని హెచ్చరించారు. బిసిలకు కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్‌లు పెంచిన తరువాతనే గ్రామ పంచాయితీలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ కనుమరుగైందని, అమాయక ప్రజలను పోలీసులు హింసిస్తున్నారని, తక్షణమే హింసను అపాలని కోరారు. ఈ సమావేశంలో ఫోరం నాయకులు జిల్లెల రామ్‌చందర్, డా.ములుగు శివకుమార్‌లాల్, రతన్ శ్యామ్‌సుందర్, రౌతు రాజయ్య, జనపాటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

హాజరైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త:**
కాచిగూడ శ్రీరాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ ఉత్సవాలలో అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్య అతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ విద్యామాన్య తీర్థులు స్వామివారు ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. ఈ ఉత్సవాలలో ఆలయ అధికారులు, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై దృష్టి పెట్టండి

-టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా



ఆరాధనోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**ముషీరాబాద్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త:** ప్రజలు డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడుతూ ఉంటే జీహెచ్‌ఎంసీ నిద్రావస్థలో ఉందని, తక్షణమే జీహెచ్ఎంసీ మేల్కొని ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. బుధవారం లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఒకేరోజులో డెంగ్యూ వ్యాధిన ఐదుగురు ప్రాణాలు వదిలితే ప్రభుత్వం పట్టించుకోవటం లేదని, అసలు రాష్ట్రంలో ఆరోగ్యశాఖా మంత్రి ఉన్నారా లేరా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఋణమాఫీ చేస్తామని మాటలు చెబుతూ, రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుచేస్తామని, రాహుల్‌గాంధీ వస్తున్నారంటూ ఢిల్లీలో కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. వర్షాలు పడుతూ దోమలు పెరిగిపోయి ప్రజల ఆరోగ్యాలు కుంటుపడుతూ ఉంటే డీఎంహెచ్ఓ కార్యాలయం పట్టించుకోవటం లేదన్నారు. ఆసుపత్రులు ఉంటే డాక్టర్లు ఉండటం లేదు, డాక్టర్లు ఉంటే మందులు అందుబాటులో ఉండటం లేదు, ఈ సమస్యలను పర్యవేక్షించే నాథుడే కరువయ్యాడని విమర్శించారు. తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి, రాష్ట్రంలో హెల్త్ ఎమర్జన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శులు నల్లెల్ల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.

## కోల్‌కతా ఘటనపై నీటిపారుదల మహిళా ఉద్యోగుల నిరసన




జలసౌధలో నిరసన తెలుపుతున్న మహిళా ఉద్యోగులు, ఇంజనీర్లు

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:**
వెస్ట్ బెంగాల్ రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో మహిళా డాక్టర్‌ని పాశవికంగా హత్య చేసిన దుర్ఘటనకు నిరసనగా ఎర్రమంజిల్‌లోని జలసౌధలో నీటిపారుదలశాఖ మహిళా ఉద్యోగులు పెద్దఎత్తున నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మహిళా ఇంజనీర్స్ ప్రతినిధి రమ మాట్లాడుతూ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో ఛీఫ్ ఇంజనీర్ ప్రమీల, సూపరింటెండెంట్ ఇంజనీర్ వాసంతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రుక్సానా, శ్రీలత, డీఈఈ మంజులత, వాసవి, నాగజ్యోతి, నివేదిత పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**అత్తాపూర్ ఆగస్టు21,ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సిఐ వెంకట్రామ్ రెడ్డి వివరాల ప్రకారం...అత్తాపూర్‌లోని పివి ఎక్స్‌ప్రెస్ వె పిల్లర్ నెంబర్ 236 దగ్గర తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి (30) రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ద్విచక్ర వాహనదారుడు నిర్లక్ష్యంగా వాహనాని నడుపుతూ దూసుకుపోవడంతో యువకుడికి తీవ్ర గాయాలైయి.అక్కడికక్కడే మృతి చెందడని తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## బోయిగూడ హత్యకేసులో నిందితులు అరెస్ట్

**ముషీరాబాద్, ఆగస్ట్ 21,ప్రభాతవార్త:** ఈనెల 18వ తేదీ బోయిగూడలో జరిగిన హత్యకేసులో నిందితులను బుధవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు గాంధీనగర్ సీఐ డి.రాజు తెలిపారు. 18వ తేదీ ఈఎస్ఐ హాస్పటల్ వద్ద కృష్ణనగర్, భోలక్‌పూర్ వాసి ఏ.నరేందర్ (37) హత్యకు గురయిన విషయం తెలిసినదే. హత్య కేసును నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం ముషీరాబాద్‌కు చెందిన యాకుబ్ అలీ, వజీర్‌ఖాన్‌లను నిందితులుగా గుర్తించి, అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. హత్యకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## కాలుష్య నియంత్రణ మండలి ఆవరణలో ధర్నా..



సనత్‌నగర్ కాలుష్య నియంత్రణ మండలి ఆవరణలో చనిపోయని బర్రెలతో ధర్నా

**సంజీవ్‌రెడ్డి నగర్, ఆగస్టు 21, ప్రభాతవార్త**
సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపిని వివరాల ప్రకారం సనత్‌నగర్‌లో ఉన్నటువంటి కాలుష్య నియంత్రణ మండలి ఆవరణలో చనిపోయిన బర్రెలతో ఇష్టారం గ్రామానికి చెందిన వారు ధర్నా నిర్వహించాచు. ఒకే కుటుంబానికి చెందిదిన 12 బర్రెలు వారలంట చనిపోయాయని ఆవేదనతో ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా ఎన్నారం మండలం ఇష్టారం గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి దాదాపుగా 12 బర్రెలు అక్కడున్నటువంటి ఫ్యాక్టరీల నుంచి వెలవడే కాలుష్యం వాటర్‌ని తాగి బర్రెలు 12 చనిపోయాయని ఆవేదనతో కాలుష్య నియంత్రణ మండలి ఆవరణలో చనిపోయిన బర్రెలను తీసుకువచ్చి బర్రెలతో ధర్నా నిర్వహించారని సనత్‌నగర్ ఇన్స్‌పెక్టర్ కె.శ్రీనివాసులు తెలిపారు.

## మీటర్ల ఏర్పాటు ప్రతిపాదన రద్దు చేయడం పట్ల సిపిఎం హర్షం

**బేగంపేట ఆగస్టు 21,ప్రభాతవార్త**
సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఏరియాలో నివాస గృహాల బోర్ వెల్స్‌కు డిజిటల్ నీటి మీటర్ల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను రద్దు చేస్తూ కేంద్ర రక్షణ శాఖ ఆగస్టు 12న గజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం నపట్ల సీపీఎం నగర కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తదితరులు హర్షం వ్యక్తం చేసారు. బోర్‌వెల్ నీటికి మీటర్లు ఏర్పాటు ప్రతిపాదనను పబ్లిక్ నోటీస్ ద్వారా గత ఏడాది కంటోన్మెంట్ బోర్డు అధికారులు తెలియజేసారు.కంటోన్మెంట్ ప్రజలు దీన్ని వ్యతిరేకించారు. సీపీఎం నగర కమిటీ నీటి మీటర్ల ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ప్రజల నుంచి సంతకాలు సేకరించింది.బోర్డు కార్యాలయం ముందు పెద్ద ఎత్తున నిరసన తెలియజేసింది.బోర్ వెల్స్‌కు నీటి మీటర్లు ఏర్పాటు చేయడం,వాడుకున్న నీటికి లెక్కలు కట్టి ఛార్జి వసూలు చేయడం,భారీగా పెనాల్టీలు వేయడం ప్రజలకు భారంగా మారుతున్నందున ఈ ప్రతిపాదన రద్దు చేయాలని సీపీఎం విజ్ఞప్తి చేసింది.ప్రజల నిరసనను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ప్రభుత్వం రక్షణ శాఖ అధికారులు నీటి మీటర్లు ఏర్పాటు నుంచి నివాస గృహాలకు మినహాయింపు ఇస్తూ గజిట్ నోటిఫికేషన్ జారీ చేయడాన్ని సీపీఎం నగర కమిటీ స్వాగతించింది.

## ప్రజ సమస్యల పరిష్కారానికి కృషి



బాబుల్‌రెడ్డి నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,ఆగస్టు 21 ప్రభాతవార్త :**
బాబుల్‌రెడ్డి నగర్‌లో బుధవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు.కాలనీలోని డ్రైనేజీ,సిసి రోడ్లు,మౌళిక వసతులు గురించి స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.వర్షం కారణంగా దెబ్బతిన్న రహదారి,వరద నీరు ఉన్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండ ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించటం జరిగిందని తెలిపారు.ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టి.చిన్నా,గోపాల్ నాయక్,కుర్మయ్య,మధుజూధన్‌రెడ్డి,జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్‌పెక్టర్ రాహుల్,జలమండలి సూపర్ వైజర్ లోకేనాథ్ పాల్గొన్నారు.

# రోస్టర్ విధానంలోనే విద్యుత్‌శాఖ పదోన్నతులు కల్పించాలి

-టివోవో 954 దాని అనుబంధ ఆర్డర్లను రద్దు చేయాలి
-ఎలక్ట్రిసిటీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్



విద్యుత్‌సౌధలో నిరసన తెలుపుతున్న అసోసియేషన్ నాయకులు శ్యాం మనోహార్, మేడి రమేష్, తదితరులు

**హైదరాబాద్, ఆగస్టు 21,ప్రభాతవార్త:**
విద్యుత్ సంస్థల్లో చేపట్టే పదోన్నతులను రోస్టర్ విధానంలోనే చేపట్లాని 2021లో దొడ్డిదారిన ఇచ్చిన టివోవో 954 దాని అనుబంధ కంపెనీల ఆర్డర్లను రద్దు చేయాలని ఎలక్ట్రిసిటీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం విద్యుత్‌సౌధలో అసోసియేషన అధ్యక్షులు శ్యామనోహార్, స్టేట్ జనరల్ సెక్రటరీ రమేష్ మేడి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 7ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను ఇవ్వాలని నిర్ణయించి ప్రక్రియ చేపట్టినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుతున్నామన్నారు. అయితే ప్రమోషన్లలో రోస్టర్ విధానాన్ని అమలు చేయకపోవడంతో గత ప్రభుత్వంలో దఫాదఫాలుగా మా నిరసనలు చేపట్టామన్నారు. డైరెక్టర్ రిక్రూట్‌మెంట్‌లో సీనియారిటీని రోస్టర్ విధానంలో కాకుండా మెరిట్ ప్రాతిపదికన నిర్ణయిస్తే ఓబిసి, ఎస్సీ,ఎస్టీ, ఉమెన్ ఇతర ఉద్యోగులకు నష్టపోయే ప్రమాదాన్ని గుర్తించి ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చామన్నారు. వారు సమస్యను పరిష్కరించకపోగా అది రెండింతలయ్యేటట్టు చేశారన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రమోషన్లలో కూడా రోస్టర్ విధానం అమలు చేయలేదని దీంతో ఏఒక్కరికి రెగ్యూలర్ ప్రమోషన్ ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. కోర్టు కేసులకు సంబంధం లేని విషయాలను సంస్థలు తమకు తాముగా కోర్టుల్లో నెడుతున్నాయన్నారు. రాజ్యాంగ సవరణ ద్వారా వచ్చిన హక్కులను సైతం కాలరాసే విధంగా విద్యుత్ సంస్థల న్యాయ సలహాదారులు వ్యవహరిస్తున్నారన్నారు. గత యాజమాన్యం ఏకపక్షంగా రిలీవ్ చేసిన ఆంధ్ర ఉద్యోగులు , విభజన కేసుతో జరిగిన నష్టాలు మళ్ళీ జరగకుండా ఉండాలంటే సిఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. కావున ఈకార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు నాంపల్లి చంద్రయ్య, సోమ్లా నాయక్, నారాయణ నాయక్, నాగరాజు, ఆనంద్‌బాబు, బీచ్‌పెల్లి ఆనందం, కుమారస్వామి, సత్యనారాయణ, శరత్, రవీందర్,కృష్ణ పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



ధర్నా నిర్వహిస్తున్న దివ్యాంగులు

**ధర్నాచౌక్, ఆగస్ట్ 21, ప్రభాతవార్త:**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ దివ్యాంగులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ (డీఎస్‌డి) రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వి.భారతి, ఉపాధ్యక్షులు కే.వెంకటేష్‌గౌడ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం డీఎస్‌డి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేసించి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడిచిపోతున్నా దివ్యాంగులకు ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయలేదని ఆరోపించారు. తమ పోరాటం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కాదని, దివ్యాంగుల పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని వారికి ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేసి, న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసి బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని, దివ్యాంగులకు కేటాయించిన ఉద్యోగ క్యాలెండర్ పద్ధతిలో భర్తీచేయాలని, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేయాలని, దివ్యాంగుల హక్కుల చట్టం 2016ను పటిష్టంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్రతి శాఖలో దివ్యాంగుల కోసం ఐదు శాతం నిధులు కేటాయించాలని, ఇందిరమ్మ ఇళ్లల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. దివ్యాంగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే త్వరలో ప్రజాదర్బార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో తెలంగాణ వ్యాప్తంగా వేలాదిమంది దివ్యాంగులు పాల్గొన్నారు.

# వర్గీకరణతో దళితుల భవిష్యత్తు సమాధి

**సైఫాబాద్, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన ప్రదర్శన జరిగింది. వర్గీకరణ అంతం-దళితుల పంతం, నరేందర్‌మోదీ, రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు సర్కార్‌లపై తిరుగుబాటు చేయాలని, వర్గీకరణ వద్దు-రాజ్యాధికారమే ముద్దు అంటూ ప్రదర్శనలో పాల్గొన్న కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. వర్గీకరణకు వ్యతిరకంగా భారత్ బంద్‌లో భాగంగా ఈ ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఛైర్మన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్డమూరి కృష్ణస్వరూప్ మాట్లాడుతూ వర్గీకరణకు ప్రయత్నాలు చేస్తే ప్రభుత్వాలను కూల్చుతామని, మనువాద పాలకులపై సామాజిక, రాజకీయ తిరుగుబాటు తప్పదని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దళిత జాతులకు భవిష్యత్తు లేదని, సామాజిక బానిసత్వం తప్పదని హెచ్చరించారు. ప్రాణాలైన అర్పించి వర్గీకరణను అడ్డుకుంటామన్నారు. దళితులను రాజ్యాధికారంలోకి రానీయకుండా మనువాద పాలక పార్టీలు లేపిన విచ్ఛిన్నకర కుట్రలే ఈ వర్గీకరణ వాదమన్నారు. ఎస్సీ జాబితాలోని 59 కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వంచిత్ బహుజన్ అగాడి రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్, బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు సిద్ధార్థ మౌర్య, ఆర్‌పిఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అశోక్, లోక్‌జన శక్తి జాతీయ ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, తెలంగాణ కమ్యూనిస్టు పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.ఇందిరా, సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర నాయకురాలు సుకన్య, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డా.వి.ఎల్. రాజు, రాష్ట్ర అధ్యక్షుడు జె.ఎన్.రావు, తెలంగాణ మాల మహానాడు అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ ఫోరం అధ్యక్షుడు ఎస్.వసంతరావు, జైభీం సేన అధ్యక్షుడు టి.బల్వంత్‌రావు, అంబేద్కర్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వడాల భాస్కర్, విసికె పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుచరిత, దళిత పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

## గానసభ పురోభివృద్ధికి ప్రభుత్వం ముందుకు రావడం హర్షణీయం


-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి



'కళా సంగీత నాట్యవేదిక'ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి,చిత్రంలో గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి, పురాణపండ శ్రీనివాస్, శంకరనారాయణ, పద్మజనీలిమ, సిహెచ్‌వి.ప్రసాద్, తాళ్ళపల్లి చక్రపాణి తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక సానుకూల దృక్పథంతో సంస్కృతి, సంగీతం, నృత్యం, సాంప్రదాయాల ప్రోత్సహిస్తున్న త్యాగరాయ గాన సభకు అండగా ఉండేందుకు ముందుకు రావడం శుభరిణామం అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. బుధవారం సాయంత్రం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నూతనంగా నిర్మించిన 'కళా సంగీత నాట్యవేదిక' ఏడవ ఆడిటోరియంను గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తితో కలిసి లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు. త్యాగరాయ గానసభ చేస్తున్న మంచి పనులు చూసి ప్రభుత్వం హర్షించి ఇందుకు తగిన సహకారం అందించేరీతిలో ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం గానసభకు ఉండాలని, మంచి రోజులు రావాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హాస్యబ్రహ్మ శంకరనారాయణ, గానసభ సంయుక్త కార్యదర్శులు పద్మజ నీలిమ, సిహెచ్‌వి.ప్రసాద్, తాళ్ళపల్లి చక్రపాణి, గుండవరపు గీతాదేవి, వంశీ సంస్థల అధ్యక్షుడు డాక్టర్ వంశీ రామరాజు, జీవిఆర్ కల్చరల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుదిబండి వెంకటరెడ్డి, అభినందన భవానీ, దేవసేన, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, చింతలపాటి సురేష్, శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, రామోజీ, మిమిక్రి కళాకారుడు మల్లం రమేష్, మల్లెల వసుంధర, డాక్టర్ కె.వి.రావు, లలితారావు, ఇంజనీర్ సమ్మయ్య, సంయుక్త తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నృత్య విద్యార్థులు, సంగీత విద్యార్థులు, వేణువాద విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు అందరిని అలరించాయి. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి జన్మదినోత్సవం సందర్భంగా ఒక కళావేదికను ప్రారంభించుకోవడం మంచి సంప్రదాయమన్నారు.


## తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే తలసానిని కోరిన బన్సీలాల్‌పేట ప్రజలు



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో మాట్లాడుతున్న ప్రజలు

**కంటోన్మెంట్ ఆగస్ట్21, ప్రభాతవార్త**
శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి ఉందని, తమను ఆదుకోవాలని బుధవారం బన్సీలాల్ పేట డివిజన్‌కు చెందిన జెఎన్ఎన్‌యుఆర్ఎం ఇండ్లలో నివసిస్తున్న ప్రజలు బన్సీలాల్‌పేట డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు ఆధ్వర్యంలో వెస్ట్‌మారెడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కోరారు. సుమారు 20 సంవత్సరాల క్రితం జెఎన్ఎన్‌యుఆర్ఎం పథకం క్రింద ఇండ్లను నిర్మించారని, వాటిలో 4,5,6,10 బ్లాక్‌లలోని 144 ఇండ్ల పరిస్థితి ప్రమాదకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ త్వరలోనే సంబంధిత అధికారులతో కలిసి పర్యటించి చేపట్టాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వినోద్, సురేష్, గజ్జెల శ్రీనివాస్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ హత్యాచార దోషులను కఠినంగా శిక్షించాలి




కార్యక్రమంలో పాల్గొన్న సిటి కౌన్సిల్ సంస్థ ప్రతినిధులు,విద్యార్థులు

**చార్మినార్,ఆగస్టు 21 ప్రభాతవార్త :**
కోలకతా ఆర్‌జికర్ మెడికల్ కళాశాల వైద్యురాలి హత్యాచారం ఘటనను ఖండిస్తూ తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్. ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం పాతబస్తీ ఫలక్‌నుమా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా శ్రద్దాంజలి ఘటించారు. కోలకతా ఆర్‌జికర్ మెడికల్ కళాశాల వైద్యురాలి హత్యాచారం ఘటనకు సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని పాతబస్తీ తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ ప్రధాన కోఆర్డినేటర్ ముత్యం యాదవ్,కోఆర్డినేటర్ శ్యాంరావు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీ తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ సంస్థ ప్రధాన కో ఆర్డినేటర్ ముత్యం యాదవ్,కోఆర్డినేటర్ శ్యాంరావు ముదిరాజ్,కళాశాలకు చెందిన లెక్చరర్ డేవిడ్,డాక్టర్.గంగాదర్‌తో పాటు కళాశాలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.




## కెజి రెడ్డి కాలేజీలో ఓరియంటేషన్ ప్రోగ్రామ్

**మొయినాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త** కేసిరెడ్డి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యాసంవత్సరానికి బిటెక్ మొదటి సంవత్సరం ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి చైర్మన్ అనురాగ్ విశ్వవిద్యాలయం ముఖ్య అతిధిగా హాజరయ్యారు. రెగ్యులర్ హాజరు సంపూర్ణ అభివృద్ధి మరియు సమర్థవంతమైన కమ్యూనికేషన్ నైపుణ్యాల యొక్క ప్రాముఖ్యతను అతను నొక్కి చెప్పాడు. అతని చిరునామాను అనుసరించి ఎల్ఎన్ కేజి రెడ్డి కళాశాల చైర్మన్ కె కృష్ణారెడ్డి కేజీఆర్ సిఇటి డైరెక్టర్ డాక్టర్ రోహిత్ కందకట్ల కళాశాలలో అందుబాటులో ఉన్న వ్యవస్థాపక అవకాశాలపై చర్చించారు. అనంతరం డాక్టర్ సాయి సత్యనారాయణ రెడ్డి పాటించాల్సిన ఆవశ్యక నియమాలన వివరిచి కార్యాక్రమం ముగిసింది. డాక్టర్ ఎంఎన్ వైస్ ప్రిన్సిపల్ మరియు అకడమిక్స్ డీన్ నర్సయ్య తల్లిదండ్రులు మరియు విద్యార్థులకు స్వాగతం పలికారు.

## మొయినాబాద్ మండలానికి నూతన ఎంఈవో శంకర్



**మొయినాబాద్, ఆగస్టు 21, ప్రభాతవార్త** మొయినాబాద్ మండలానికి నూతనంగా శంకర్ ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. రెగ్యులర్ బదిలీలో భాగంగా శంకర్ పరూక్నగర్ మండలం నుంచి మొయినాబాద్ మండలానికి మండల విద్యాధికారిగా బదిలీలో భాగంగా మొయినాబాద్‌కు బాధ్యతలు తీసుకున్నారు. అభివృద్ధి అధికారి మండల అభివృద్ధి అధికారి సంధ్య ఆధ్వర్యంలో పదవీ బాధ్యతలు స్వీకరించడం జరిగింది. మొయి నాబాద్‌కు గత 15 సంవత్సరాలుగా వెంకటయ్య మొయినాబాద్ మం డలానికి విధులు నిర్వహించారు. వెంకటయ్య మండలంలోని కనకమా మిడి పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేస్తూనే మొయినాబాద్ మండల ఎంఈవోగా విధులు నిర్వహించారు. మండలా నికి ఎట్టకేలకు 15 సంవత్సరాల తర్వాత ఎంఈవోగా శంకరయ్య బాధ్య తలు స్వీకరించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో మండల సిబ్బంది తదితరులు పాల్గొని శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.

## వెల్జాల్‌లో ఉచిత వైద్య శిబిరం విజయవంతం



**తలకొండపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు గ్రామాలో వ్యాప్తిస్తున్నాయని గ్రహించి ప్రజలందరూ బాగుండాలని రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తలకొండపల్లి జెడ్పిటిసి తెలంగాణ రాష్ట్ర మాజీ మిషన్ భగీరథ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఉచిత వైద్య శిబిరంఏర్పాట చేయడం జరిగింది. ఉప్పల డాక్టర్ అచల్ మరియు కామినేని హాస్పిటల్ వారి సౌజన్యం ఆధ్వర్యంలో 461 మంది రోగులకు జనరల్ మరియు బిపి షుగర్ పరీక్షల చేసి జలుబు దగ్గు గొంతు నొప్పి వైరల్‌ఫీవర్ వంటి వ్యాధుల భారిన రోగులకు 461 మందికి మందులు అందజేయడమే కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ గ్రామ మాజీ సర్పంచ్ సిఎల్ సంగీత శ్రీనివాస్ యాదవ్ రంగారెడ్డి జిల్లా మాజీ జడ్పికో ఆప్షన్ మెంబర్ ముజిబుర్ రహ్మాన్ గ్రామ మాజీ ఉపసర్పంచ్ అజీజ్ మాజీ ఎంపిటిసి అంబాజీ పిఏసిఎస్ చైర్మన్ కోన రవికుమార్ సింగిల్ విండో డైరెక్టర్ కటికల శేఖర్‌యాదవ్ నాయకులు నరేందర్‌గౌడ్ వెంకట్‌రెడ్డి విజయ్ కుమార్ లక్ష్మీ నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంకులో సాంకేతిక సమస్యను ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే

**కేశంపేట ఆగస్టు 21, ప్రభాతవార్త** మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ నందు 1054 మంది రైతులకు సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానందున ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు ఐఏఎస్ డైరెక్టర్ అగికల్చర్ బి గోపి ఏఎఎస్‌ని కలిసి బుధవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేశంపేట కెనరా బ్యాంక్ బ్రాంచ్ నుందు రైతులకు రుణ మాఫీ కాని వారికి అతిత్వరంలో రుణమాఫీ అవుతుందని కెనరా బ్యాంక్ అధికారులు లోన్ రేనివల్ తేదీకి బదులు లోన్‌తీసుకున్న తేదనీ (సాంక్షన్)పై అధికారులకు పంపడం మూలంగా ఆ లోన్‌లు కట్ ఆఫ్ తేదీ అయిన 12.12.18 నుంచి 09.12.23 పరిధిలోని రాలేదు. తెలంగాణ వ్యాప్తంగా కెనరా బ్యాంక్ పరిధిలోని దాదాపు 36,000 మంది రైతులకు వివిధ కారణాలవల్ల రుణమాఫీ అమలు కాలేదని వారికి అతి త్వరలో రుణమాఫీ అమలు అయ్యేటట్లు తగు చర్యలు తీసుకుంటామని ప్రిన్సిపల్ సెక్రెటరీ మరియు డైరెక్టర్ తెలిపారు.

## పోచమ్మగుడికి సిసి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే నిధుల నుంచి సాయం



**తలకొండపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త** తలకొండపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన మాల పోచమ్మ గుడికి చుట్టూ సిసి రోడ్డుకు గౌరవనీయులు కల్వకుర్తి ఎమ్మెల్యే కాసిరెడ్డి నాయణరెడ్డి రూ. 500000 ఐదు లక్షల ప్రొసిడింగ్ ఎమ్మెల్యే నిధులనుంచి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిపిసిసి కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి డిసిసి కార్యదర్శి రవీందర్ యాదవ్ కల్వకుర్తి సోషల్ మీడియా కన్వీనర్ అజీమ్ మండల మైనార్టీ అధ్యక్షు డు ఆరిఫ్ గ్రామ అధ్యక్షుడు రమేష్ తుమ్మ నర్సింహ్మా కట్టుమల్ల పురుషోత్తం జూపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారికి మెరుగైన వైద్యం అందించాలి

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రబాతవార్త:** ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి మెరుగైన వైద్యం అందించేలా చూడాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం ఊరెంటితాండాకు చెందిన రాజు నాయక్ కుమారుడు ( 1 సంవత్సరం బాబు) అనారోగ్యంతోహైద్రాబాద్‌లోని నీమ్స్ ఆసుపత్రిలో చేరాడు, ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి బుదవారం ఆసుపత్రికి వెళ్ళి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను కోరారు.



చిన్నారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే



మొక్కలు నాటేందుకు గుంతలను పరిశీలిస్తున్న ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్

## మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

**జిల్లెడు చౌదరిగూడ, ఆగస్టు 21,(ప్రభాతవార్త):** ప్రభుత్వ ఆదేశాల మెరకు గ్రామాల్లో మొక్కలు నాటడం వల్లన పర్యావరణ పరిరణ సాధ్య మవుతుందని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుదవారం జిల్లెడు చౌదరిగూడ మండలంలోని చౌదరిగూడ గ్రామంలో మొక్కలు పెంచేం దుకు తీస్తున్న గుంతలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాటిన ప్రతి మొక్కను బతికించాలని ఆయన సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారంగ ప్రతి ఒక్కరు విధులు నిర్వహించాలని అన్నారు. విధి నిర్వహనలో ఎలాంటి అలసత్వం వహించిన శాఖ పరమైన చర్యలు తప్పని అన్నారు. క్షేత్రసహాయకులు గ్రామ స్థాయిలో ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలని ఆయన పెర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు అక్కమ్మరెడ్డి, దేవోజి, ఫీల్డ్ అసిస్టెంట్లు లింగంగౌడ్. హన్మంత్‌రెడ్డి, ఉమావతి, రాషోద్దిన్, అంజనేయులు, సాయి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

## ఎల్ఆర్ఎస్ 2020పై హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ పరిధిలో ఎల్ఆర్ఎస్ 2020 కొరకు హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు కమిషనర్ పి వేమన రెడ్డి తెలిపారు. ఎల్ఆర్ఎస్ 2020పై సమస్యల పరిష్కారానికి అధికారులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేసి చర్చించినట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ సమస్యల పరిష్కారానికి హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చించినట్లు తెలి పారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్లాట్ల యాజమానులు ఎల్ఆర్ఎస్‌పై ఎమైనా సమస్యలుంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని తెలిపారు. హెల్ప్‌డెస్క్ ఇంఛార్జీగా రామ్ కమల్ సెల్‌ఫోన్ నెంబరు 7893960904కు ఫోన్ చేసి తగిన సలహాలు పొందగలరని కమిషనర్ తెలిపారు.

## ఎఎన్ఎం నాగమణి మృతి తీరని లోటు: చైర్మన్



ఎఎన్ఎం నాగమణి సంతాప సభలో పాల్గొన్న చైర్మన్ కొండల్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** పల్లె దవాఖానలో ఎఎన్ఎం స్వర్గీయ నాగమణి చేసిన సేవలు కొనియాడదగినవని పోచారం మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజిగూడ బస్తీ దవాఖానాలో ఎఎన్ఎంగా పనిచేసిన నాగమణి ఇటీవల అకాల మరణం పొందడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొని ఎఎన్ఎం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరోనా సమయంలో నాగమణి ఇంటింటికి తిరిగి సేవలు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, నాయకులు నల్లవెల్లి శేఖర్ ముదిరాజ్, డాక్టర్ అనిత, రాధరపు యాదగిరి, బి. రాజేశ్వర్ రెడ్డి వైద్య సిబ్బంది శ్రీనివాస్, మాలతీ, మంగమ్మ, పద్మ, మాధవి, రజినీ, నళినీ, సబిత తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లి యువత ఆధ్వర్యంలో రక్షాబంధన్



రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

**చౌడపూర్ ఆగస్టు21, ప్రభాతవార్త :** చౌడపూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో కొత్తపల్లి యువత ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. కొత్తపల్లి యువ నాయకుడు రఘు మాట్లాడుతూ....రక్షాబంధన్ విశిష్టతను విద్యార్థులకు వివరించి, సనాతన ధర్మం గురించి ,సమాజంలో స్త్రీలు, బాలికలపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాల నుండి ఎలా ఎదుర్కోవాల్లో చెప్తు...బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ,గ్రామ యువకులు జోగు శ్రీను, జంబుల నరేందర్ ,పెంటల విష్ణు, సతీష్, గోవర్ధన్ ,కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైరల్ జ్వరాల నుండి ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి




**కొత్తూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** డెంగ్యూ బారిన పడకుండా దోమలు నివారించేందుకు ప్రతి ఒక్కరు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ హరికిషన్ తెలిపారు. కొత్తూర్ పురపాలికలోని తిమ్మాపూర్ డెంగీతో వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో అప్రమత్తమైన వైద్యశాఖ వెంటనే డాక్టర్ హరికిషన్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి డెంగ్యూ, మలేరియా వంటి టెస్టులు చేస్తున్నారు. అనంతరం డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ....డెంగ్యూ వ్యాధితో చనిపోయిన వ్యక్తి పరిసరాల్లో చుట్టుపక్కల ప్రతి ఇంటింటికి వైద్య సిబ్బందితో కలిసి ఫీవర్ సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. దీంతోపాటు 8మందికి డెంగ్యూ టెస్ట్ చేయగా అందరికి నెగిటివ్ వచ్చిందని నిర్ధారించడం జరిగింది. ఈకార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కిరణ్, సీహెచ్‌వో నాగేష్, ఏఎన్ఎంలు, ఆశలు తదితరులు ఉన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి మా పెద్దన్నయ్య..!

### ఉచిత బస్సు ప్రయాణంలో మహిళల మనోగతం

**నందిగామ, ఆగస్టు 21, ప్రభాతవార్త:** మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యాన్ని కలి ్పంచిన సీఎం రేవంత్‌రెడ్డిని మహి ళలు పెద్దన్నయ్యగా కొలుస్తున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినానికి వెళ్లిన సంద ర్భంగా నందిగామ మండలం తాటిగడ్డ తండానుంచి దర్గా మీదుగా ఆమనగల్లు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలు తమ తమ మనోగతాలను వెల్ల డించారు. రాఖీ పండుగ సందర్భంగా తమ సోదరులకు రాఖీ కట్టడానికి ఆర్టీసీ బస్సుల్లో వెళ్తున్నామన్నారు. ఉచిత బస్సు సౌకర్యం తమకు మేలు జరగడంతో పాటు ఆర్థిక భారం తప్పించిందన్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బస్సులు నడపాలని ఒకరోజు ముందుగానే సంబంధిత డిపో మేనేజర్లకు విన్నవించడం పట్లహర్షం వ్యక్తం చేశారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు సిఎం రేవంత్‌రెడ్డి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినదుకు ధన్యవాదాలు తెలిపారు. తమకు చేదోడు వాదోడు అందిస్తునన సిఎం చల్లగా ఉండాలని



నందిగామ తాటిగడ్డ తండా మీదుగా ఆమనగల్లు వైపు ఆర్టీసి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

## సభ్యత్వ నమోదులో యువత క్రియా శీలకపాత్ర పోషించాలి

### మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వెంకట్

**పెద్దేముల్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** సభ్యత్వ నమోదు ప్రక్రియలో యువత క్రియాశీలకంగా పాల్గోనాలని మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడుఇందూరు వెంకట్ అన్నారు. యువజన కాంగ్రెస్ ఎన్నికలలో బాగంగా బుదవారం పెద్దేముల్ మండల యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్బంగా వెంకట్ మాట్లాడుతూ యువత ప్రత్యక్ష రాజకీయాలలోకి ప్రవేశం చేయడానికి యూత్ కాంగ్రెస్‌చక్కటి వేదిక అవుతుందని అన్నారు. ఇతర పార్టీలతో పోలిస్తే కాంగ్రెస్‌లో లీడర్‌షిప్ పెరిగే విధంగా కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. యువకుడికి సమాజం, స్థానిక సమస్యల పట్ల పూర్తి అవగాహన పొందే అవకాశం ఉంటుందని అన్నారు. 18 నుంచి 35 సంవత్సరాలు కలిగినప్రతి యువకుడు విత్ ఐవైసి యాప్ ద్వారా సభ్యత్వం తీసుకోవాలని అన్నారు. మండలంలో ఉన్న యూత్ కాంగ్రెస్ నాయకులందరు స్నేహ పూర్వకమైనవాతవరణంలో కలిసి కట్టుగా మండలంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసేందుకు కృషిచేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు శ్రీనివాస్, తుపాకుల అనిల్‌కుమార్, హర్షవర్ధన్‌రెడ్డి, మహేష్, కిరణ్, ప్రేమ్ సింగ్, మహమూద్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న యువ నాయకులు



రోడ్లపై నిలిచిన నీరు చూపిస్తున్న కాలనీవాసులు

## యాచారంలో రోడ్ల పరిస్థితి అధ్వానం

### పట్టించుకోని స్పెషల్ ఆఫీసర్లు

**యాచారం ఆగస్టు21, ప్రభాతవార్త :** గతనెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు యాచారం మండల కేంద్రంలో ఉన్న సాయినగర్ కాలనీలో రోడ్డు బురదమా యంగా కావడంతో ప్రజలు స్కూలు పిల్లలు నడవడానికి ,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, కాలనీ ప్రెసిడెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ...ఈ విషయాన్ని గతంలో అధికారుల దృష్టికి తీసుకవెళ్లిన సందర్భంగా నిధులు లేవు మేము ఏమి చేయాలని ఇప్పటికే అప్పులు చేసినమని అధికారులు చేతులు ఎత్తేశారని రోడ్ల మీద నీరు చేరడంతో మురికి ఎక్కువై ఈగలు దోమలు చేరి జ్వరాలు వస్తున్న పరిస్థితి ఉందని వాపోయారు. కావున ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి ఈలాంటి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. లేని పక్షంలో ఆందోళనకు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చారి, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సంసిద్ధమవుతున్న అధికారులు

**యాచారం ఆగస్టు21, ప్రభాతవార్త :** ఎప్పడెప్పుడు అని ఎదురు చూస్తున్నా స్థానిక ఎన్నికలకు రంగం సిద్ధమవుతుంది ప్రత్యేక అధికారుల పాలనలో విసిగిపోయిన ప్రజలు గ్రామపంచాయతీ ఎన్నికల కోసం ఆశావాహులు అన్ని ఏర్పాట్లకు సిద్ధం అయ్యారు. అధికారులు ఎన్నికలపై శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్నట్లు తెలుస్తుంది. పంచాయతీ ఎన్నికల ఓటర్ జాబితా తయారీకి షెడ్యూల్ ఖారారైందని సెప్టెంబర్ 6న వార్డుల వారీగా ముసా యిదా ఓటర్ జాబితా ప్రచురణ 7 నుండి 13వరకు అభ్యంతరాల స్వీకరణ 9,10 న రాజకీయ పార్టీల నుండి సూచలన స్వీకరణ, 21న వార్డుల వారిగా తుది ఓటరు జాబితా ప్రచురణకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుంది.

## బాధిత కుటుంబాలకు ఎల్ఎన్ రెడ్డి భరోసా



ఆర్థిక సహాయం అందజేస్తున్న మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మినరసింహారెడ్డి

**కడ్తాల్, ఆగష్టు 21 ప్రభాతవార్త :** కడ్తాల్ గ్రామానికి చెందిన తల్లోజు బాలచారి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. విషయం తెలుసుకున్న స్థానిక మాజీ సర్పంచ్ గూడూరు నర్సింహ్మారెడ్డి కడ్తాల్ గ్రామంలో బాలచారి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందించి కుటుంబానికి మనోధైర్యాన్ని నింపారు. అనంతరం ఇటీవల అనారోగ్యానికి గురైన గురిగళ్ళ పెంటయ్యను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబాలకు నేనున్నానని, ప్రభుత్వం ద్వారా ఎల్ఓసి అందే విధంగా చర్యలు తీసుకుంటామని పెంటయ్యకు భరోసానిచ్చినట్లు తెలిపారు. మాజీ సర్పంచ్ తిరునగిరి వేణుగోపాల్, రైతు సమన్వయ సమితి గ్రామ కో ఆర్డినేటర్ మంగల్‌పల్లి నరసింహ, మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ లాయక్ అలీ, తల్లోజు యాదయ్య చారి, మాజీ వార్డు సభ్యులు గురిగళ్ళ జంగమ్మ రామచంద్రయ్య, తల్లోజు వేణు, ఇర్షాద్, కొప్పుకృష్ణ, మహేష్, శ్రీశైలం, శ్రీకాంత్, కృష్ణ పాల్గొన్నారు.

## కటికల కుమార్‌యాదవ్‌కు ఘన నివాళి



**తలకొండపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త** తలకొండపల్లి మండల చంద్రదాన గ్రామ బిఆర్ఎస్ నాయకుడు కటికెల మల్లేష్ యాదవ్ తమ్ముడు కటికల కుమార్ యాదవ్ దశదిన కర్మ సందర్బంగా వారి చిత్రపటానికి పూలు సమర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ భగవంతుని ప్రార్థించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రాములు గంజి శ్రీను గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జంగయ్య గౌడ్ సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్ యాదవ్ రాంపూర్ ఆలయ మాజీ చైర్మన్ శ్రీశైలం యాదవ్ నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి శేఖర్ యాదవ్ యాదయ్య యాదవ్ యాదవ్ సురేష్ గణేష్ యాదవ్ చెన్నయ్య యాదవ్ యాదయ్య యాదవ్ మల్లేష్ అయ్యన్న కృష్ణయ్య పోషయ్య తదితరులు పాల్గొన్నారు.

## తలకొండపల్లిలో భారత్‌బంద్ విజయవంతం



**తలకొండపల్లి, ఆగస్టు 21, ప్రభాతవార్త** మాల మహానాడు ఆధ్వర్యంలో విద్యా సంస్థలు మరియు షాపులు సంపూర్ణంగా బంద్ చేయడం జరిగింది. ఎస్సీ ఎస్టీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ ఎస్సీవర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ మండల కేంద్రంలో నిర్వహించారు. ఎస్సీవర్గీకరణకు వ్యతిరేకంగా భారత్ బంద్ నిర్వహించడం జరిగింది. ర్యాలీతో ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలను బంద్ చేయడం జరిగింది. ఎస్సీవర్గీకరణ వద్దంటూ నినాదాలు సరసనలు తెలుపడం జరిగింది. ఎస్సీ వర్గీకరణపై రెండు రాష్ట్రాల సిఎంల వైఖరి మార్చుకోవాలని మాల మహానాడు ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. దళితులను విభజించు పాలించు విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోడీ కులాల మధ్య చిచ్చుపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాలలు సైనికులుగా మారి ప్రజాప్రతినిధులను నిలదీస్తామని హెచ్చరించారు. గతంలో సుప్రీంకోర్టు రిజర్వేషన్‌పై తీర్పు వర్గీకరణ వ్యతిరేకంగా ఇచ్చి ఇప్పుడు ఎట్లా అనుకూలంగా ఇస్తుందని ప్రశ్నించారు. వర్గీకరణ రద్దు అయ్యేంతవరకు పోరాటం చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

### యాచారం మండల కేంద్రంలో..



భారత్ బంద్‌లో పాల్గొన్న మాల మహానాడు నాయకులు

**యాచారం ఆగస్టు21, ప్రభాతవార్త :** భారత్ బంద్ పిలుపు మేరకు మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామంలో ఏబిసిడి రిజర్వేషన్‌కు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో స్కూలు, కిరాణా షాపులు బంద్ చేయించారు. ఈ కార్య క్రమంలో మాల మహానాడు నాయకులు వడ్డమోని దశరథం, వి. భీష్మ, రాధాకృష్ణ, కొండ్ర యాదయ్య, సురమాళ్ల రామదాసు, శ్రీకాంత్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాలేదు.. అయోమయంలో రైతులు

**కొత్తూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** ప్రభుత్వం రైతులకు రూ. 2లక్షల రుణమాఫీ చేయడంతో కొంతమందికి రుణమాఫీ కాలేదు. మరికొందరికి కాకపోవడంతో రుణమాఫీ కానీ రైతులు వ్యవసాయాధికారి వద్ద బుధవారం వెళ్లబోసుకుంటున్నారు. బుధవారం కొత్తూర్ మండలంలోని రుణమాఫీ కానీ రైతులు అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్‌నాయక్ వద్ద ప్రజలు తమకు రుణమాఫీ కాలేదని ఆవేధన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి రుణమాఫీ అవుతుందని అగ్రికల్చర్ ఏఈ గోపాల్‌నాయక్ రైతులకు వివరించారు. కొన్ని సమస్యల వల్ల రుణమాఫీ కాలేదని కొందరు పేర్లు ఆధార్ కార్డులో ఒక పేరు, పాస్‌బుక్‌లో మరో పేరు అలాగే వివిధ కారణాల వల్ల రుణమాఫీ కాలేదు. రుణమాఫీ కానీ రైతులకు వారి సమస్యలు పరిష్కరించి రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని అగ్రికల్చర్ ఆఫీసర్ గోపాల్‌నాయక్ రైతులకు భరోసా కల్పించారు. రుణమాఫీ కానీ రైతుల నుండి ఎలాంటి సమస్యలు ఉన్నాయో పరిశీలించి వారి వద్ద నుండి కావల్సిన పేపర్లను తీసుకుని వారికి రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకకుంటున్నామన్నారు.



వ్యవసాయాధికారితో మాట్లాడుతున్న రైతులు

## అనుమతిలేకుండా డ్రోన్లు ఎగరవేస్తే చర్యలు : ఎస్ఐ

**బొంరాస్‌పేట్, ఆగస్టు21, ప్రభాతవార్త:** దుద్యాల్ మండలం లగచర్ల, హకింపేట్, పోలేపల్లి, రోటిబండతాండ, పులిచెర్లకుంటతాండ గ్రామాల్లో అనుమతిలేకుండా డ్రోన్లు ఎగురవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని బొంరాస్‌పేట్ ఎస్ఐ అబ్దుల్ రాహుఫ్ అన్నారు. ఈ గ్రామాలకు సమీపంలో కొందరు వ్యక్తులు పోలీస్‌లు, ఇతర అధికారుల దగ్గర ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా డ్రోన్లు ఎగురవేస్తున్నారని ఇలా ఎగురవేయడం వలన అక్కడి ప్రజల ప్రైవసీకి కల్గించినట్లు అవుతుందన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



వినాయక్ నగర్ కాలనీ సమీపంలోగల రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

# మేడ్చల్ మున్సిపాలిటీలో పేరుకు పోయిన చెత్త

**మేడ్చల్, ఆగస్టు 21. ప్రభాతవార్త :** చెత్త పేరుకుపోయి దుర్గంధంగా మారినా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మేడ్చల్ మున్సిపాలిటీ పేరు పెద్ద ఊరు దిబ్బగా మారిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఎర్ర చెరువు వద్ద నిత్య చెత్త డంపింగ్‌గా ప్రతిరోజు దర్శనమిస్తుంది. అదే విదంగా వినాయక నగర్ కాలనీలో వారం రోజులుగా రోడ్డుపై చెత్త పేరుకుపోయినా తొలగించే వారు లేకపోవడంతో దుర్గందం వెదజల్లుతున్నది. అదే విదంగా ఎర్ర చెరువు కట్ట పొడవునా చెత్త మయంగా మారింది. అంతే కాకుండా ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో వాన చినుకు పడితే చాలు పట్టణంలోని కాలనీల్లో మురికి కాలువలు పొంగి పొర్లుతు రోడ్ల మీదకు రోత వచ్చి మురికిమయంగా మారుతున్నాయని హౌజింగ్ బోర్డు కాలనీ, ఉమా నగర్ కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినప్పుడు మాత్రం తూతూ మంత్రంగా పని చేసి వెళ్లిపోతారు. తెల్లవారితే మళ్లీ అదే పరిస్థితి నెలకొంటున్నదని ఆరోపనలు వెలువడుతు న్నాయి. అంటురోగాలు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ ఆదేశాలున్నా మేడ్చల్‌లో మాత్రం అందుకు విరుద్దంగా ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. గొప్పలు చెప్పుకోవడం తప్ప మేడ్చల్ మున్సిపాలిటీలో చేసిందేమి లేదని, ఇప్పటికైనా మున్సిపల్ చైర్ పర్సన్, మున్సిపల్ కమిషనర్ పట్టించుకుని కాలనీల్లో చెత్త పేరుకుపోకుండా చూడాలని కాలనీల ప్రజలు కోరుతున్నారు.

## అలుగు పారిన మేడ్చల్ పెద్ద చెరువు



అలుగు పారుతున్న మేడ్చల్ పెద్ద చెరువు

**మేడ్చల్, ఆగస్టు 21. ప్రభాతవార్త :** మేడ్చల్ పెద్ద చెరువు అలుగు పారింది. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వానా కాలంలో ఎన్నడు కురువని వాన కురిసింది. దీంతో చెరువులోకి నీరు వచ్చి చేరడంతో బుధవారం మద్యాహ్నం నుండి అలుగు దుంకింది. దీంతో స్థానిక ప్రజలు, రైతులు, మత్స్య కారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పై నుంచి నీరు చెరువులోకి వస్తుండటంతో అలుగు మరింత పెరుగనుంది.

## ఆర్‌యూబీ వంతెన వద్ద ప్రమాదకరంగా ఇండ్లు

**నిర్మాణ పనులు ఆలస్యం కావడంతోనె ఇండ్లకు ప్రమాదం**



మేడ్చల్ రైల్వే గేటు వద్ద ఆర్‌యూబీ వంతెన వద్ద ప్రమాదకరంగా ఇండ్లు

**మేడ్చల్, ఆగస్టు 21. ప్రభాతవార్త :** మేడ్చల్ రైల్వే గేట్ వద్ద నాలుగేండ్లుగా నత్తనడకగా కొనసాగుతున్న రైల్వే ఆర్‌యూబీ వంతెన నిర్మాణ పనులతో ట్రాఫిక్‌కు తీవ్రంగా ఇబ్బంది కలుగడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఏర్పడింది. మేడ్చల్ పట్టణంలోని రైల్వే గేట్ వద్ద రైల్వే ఆర్‌యూబీ వంతెన నిర్మాణం కొరకు సుమారు నాలుగు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించారు. అందుకు గేటుకు ఇరువైపుల గుంత తీసి పట్టణ వైపు గోడలు, రోడ్డు వేశారు. కానీ గేటుకు మరో పక్క గిర్మాపూర్ వైపు గుంత తీసి వదిలి వేయడంతో వానలకు ప్రమాదకరంగా మారింది. ఏండ్ల క్రితం గుంత తీసి ఏండ్లు గడుస్తున్నా సదరు కాంట్రాక్టర్ రోడ్డుకు ఇరువైపుల సీసీ గోడలు నిర్మించకపోవడంతో గతంలో మట్టి గుంతలోకి జారి పడింది. మంగళవారం కురిసిన వానకు పెద్ద ఎత్తున మట్టి జారిపడటంతో పక్కనే ఉన్న ఇండ్లు ప్రమాదకరంగా మారాయి. ఆర్‌యూబీ వంతెన నిర్మాణం ఆలస్యంతో తమ ఇండ్లకు ఎసరు ఏర్పడిందని అక్కడి సమీప ఇండ్ల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌ను కలిస్తే తమకు బిల్లు సకాలంలో రాక ఆలస్యం జరిగిందని, కాని రెండు మూడు రోజుల్లో గోడను నిర్మిస్తామని చెబుతున్నారని ఇంటి యజమానులు ఆరోపిస్తున్నారు. పాలకులు, అధికారులు తమ గోడును పట్టించుకుని తమ ఇండ్లు కూలిపోకుండా చూడాలని అక్కడి ఇండ్ల యజమానులు కోరుతున్నారు.

## సోమారంలో కాలం చెల్లిన వ్యర్థ పదార్థాల డంప్



మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామంలో డంపు చేసి వ్యర్థ పదార్థాలు

**మేడ్చల్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామ శివారులో కాలం చెల్లిన వ్యర్థ పదార్థాలను గుర్తు తెలియని వ్యక్తులు డంపు చేశారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్ 80లో గల ప్రభుత్వ భూమిలో గుర్తు తెలియని వాహనంలో కాలం చెల్లిన సీతల పానియాల సీసం బాటిల్లు పెద్ద మొత్తంలో డంపు చేసి వెళ్లారు. ఈ వర్థ పదార్థాల వల్ల పశువులకు ప్రమాదం ఏర్పడనుందని, మనుషులు తిరగలేని విదంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ వ్యర్థ పదార్థాలను గ్రామ శివారులోని గోదాముల నుంచే తెచ్చి వేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. డంపు చేసిన వారిని గుర్తించి వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



అలియాబాద్ చౌరస్తా వద్ద మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేసిన ఆందోళన వ్యక్తం చేస్తున్న దృశ్యం

## అలియాబాద్ చౌరస్తా వద్ద మాల మహానాడు రాస్తారోకో

**శామీర్‌పేట, ఆగస్టు 21, ప్రభాతవార్త** ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు అలియాబాద్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు జాతీయ అధ్యక్షులు జి.చెన్నయ్య భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్లు దీనిలో భాగంగానే అలియబాద్ చౌరస్తాలో మాలమహానాడు ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించటం జరిగిందని అన్నారు. బుధవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద శామీర్‌పేట మండల మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగ నినాదాలు చేస్తూ రాస్తారోకో చేసి మాలమహానాడు నాయకులు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగ పాల్గొన్న మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మాల మహానాడు అధ్యక్షులు మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగ సుప్రీంకోర్టు తీర్పు రావటం బాదాకరంగ ఉందన్నారు. మాల సామాజిక వర్గానికి అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ అమలు చేయవచ్చని రాష్ట్రాలకు సూచించటం భాదాకరంగ ఉందని వెంటనే ఈ తీర్పును వెనక్కి తీసుకోవాలని మాల సామాజిక వర్గం కోరుతున్నట్లు తెలిపారు. ఎస్సీలను విభజించే విధంగ ఎస్సీ వర్గీకరణ విధానం ఉంటుందని దీనిని అమలు చేయవద్దని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జాహంగీర్, ప్రవీణ్, రవి, శ్యామ్, జాహింగీర్, కృష్ణ, గోవర్దన్, హేమంత్, సత్తి, నవీన్ తదితరులు పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు



తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్స వాలు సందర్భంగ పూజలు జరిగిన దృశ్యం

**శామీర్‌పేట, ఆగస్టు 21, ప్రభాతవార్త** తూంకుంటలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి 353వ ఆరాధన ఉత్సవాలు ఘనంగ నిర్వహిస్తున్నారు. బుధవారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీలోని శ్రీగాయిత్రీ మహాక్షేత్రంలో శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్స వాలు ఘనంగ జరుగుతున్నాయి. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్ఎల్ఎన్. మూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. వేదపండితుల మంత్రోచ్చరణల మద్య శ్రీరాఘవేంద్రస్వామి ఆరాధనోత్స వాలు కన్నుల పండుగగా జరుగుతున్నాయి. శ్రీస్వామి వారు బృందావనం నుంచి బయటకు వచ్చి భక్తులకు ఆశీస్సులు అందించిన రోజు అని చాల ముఖ్యమైన రోజని ఆయన తెలిపారు. ప్రధాన అర్చకులు రాఘవేంద్ర పండితుడు స్వామి వారికి నిత్య ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి బి.చంద్రశేఖర్‌యాదవ్, మండల, మున్సిపల్ భక్తులతో పాటు నగరం నుంచి పలువురు భక్తులు పాల్గొని పూజలు చేశారు.

## తూంకుంటలో ఎల్ఆర్ఎస్ మేళా

**మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్**

**శామీర్‌పేట, ఆగస్టు 21, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ మేళా గురువారం నుంచి ప్రారంభం అవుతుందని, తమ ప్లాట్లను క్రమబద్దీకరణ చేసుకోవాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ పేర్కొన్నారు. శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ పరిధిలోని వివిధ వార్డుల (గ్రామాల) వారు 2020లో ఎల్ఆర్ఎస్ కొరకు ధరఖాస్తు చేసుకున్న వారికి తమ ప్లాట్లకు క్రమబద్దీకరించుకొనుటకు ఎల్ఆర్ఎస్ అవకాశం కల్పించటం జరుగుతుందని ఆయన అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ కోసం ధరఖాస్తులు చేసుకున్న వారు మున్సిపల్ కార్యాలయంకు విచ్చేసి హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించవచ్చన్నారు. దీని కోసం ఇద్దరిని నియమించటం జరిగిందని ఆయన అన్నారు. మున్సిపల్ సిబ్బంది పల్లె జీవన్ 8978146897, టి.భానుచందర్ 9154279692లను ఫోన్లలోనూ సంప్రదించవచ్చని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పట్టణ ప్రజలకు మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ సూచించారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

**కుల్కచర్ల, ఆగస్టు 21, ప్రభాతవార్త** ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన కుల్కచర్ల మండల కేంద్రంలో జరిగింది. బుధవారం వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కే ంద్రంలోని ఊరడి కిష్టయ్య చిన్నమ్మల రెండవ కుమారుడు శివకుమార్ (24) ఉదయమే ఇంటి నుంచి వెళ్లిపోయి మైలమ్మ చెరువు తూము సమీపంలోని తమ సొంత పొలంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. మృతుడు శివకుమార్ ప్రాథమిక సహకార సంఘం ఆఫీసులో తాత్కాలిక స్వీపర్‌గా పనిచేస్తున్నాడు.

## ఏయూలో స్వాస్త ఫార్మసీ టెక్నికల్ క్లబ్ ఆవిష్కరణ

**ఘట్‌కేసర్, ఆగస్టు 21, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయంలో బుధవారం ఫార్మసీ విభాగం ఆధ్వర్యంలో టెక్నికల్ క్లబ్ స్వాస్తని ప్రారంభించారు. ఫార్మసీ డీన్ డాక్టర్ వసుధభక్షి, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ సునంద్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ ఫర్హానాలతో కలిసి సాస్త్య ఫార్మసీ టెక్నికల్ క్లబ్ లోగొను ఆవిష్కరించారు. డీన్ వసుధభక్షి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో వస్తున్న వినూత్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను నిష్ణాతులుగా తయారు చేయడంలో క్లబ్ దోహద పడుతుందన్నారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన సంబంధాలను నిర్మించడం వారిలో వ్యక్తగత, సామాజిక ఎదుగుదలను నెలకొల్పడమే క్లబ్ ఉద్దేశ్యం అన్నారు. ఈకార్యక్రమంలో క్లబ్ స్టూడెంట్ ప్రెసిడెంట్ బి.ధీరజ్ కుమార్, వైఎస్ ప్రెసిడెంట్ వై.సనూజ, కార్యదర్శి శృతికరెడ్డి, కోశాధికారి పి.మౌనిక, పబ్లిక్ రిలేషన్స్ లీడ్ ఎ.జనని, ఈవెంట్స్ లీడ్ అజయ్‌కుమార్‌రెడ్డి, క్లబ్ సభ్యులు, ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు నీటిని అందించేందుకు పైపులైను



కెఎల్ఆర్‌నగర్‌లో నీటి పైపులైను పనులను ప్రారంభిస్తున్న పావనియాదవ్

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** ప్రజలకు నీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యాయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 5వ వార్డు పరిధిలోని కెఎల్ఆర్‌నగర్ రూ.8 లక్షలతో చేపట్టనున్న మంచినీటి పైపులైను పనులను బుధవారం ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. మిషన్ భగీరథ పథకం పైపులైను ఏర్పాటు కోసం జేసీబీతో తవ్వకాలు చేసి నీటి పైపులైను వేయించేందుకు పనులను మొదలుపెట్టారు. ఈకార్యక్రమంలో కమీషనర్ సాబేర్‌ఆలీ, కౌన్సిలర్ కొమ్మిడి అనురాధ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో ప్రిన్సిపల్ భాస్కర్ మృతి

**షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 21, (ప్రభాతవార్త) :** షాద్‌నగర్ పట్టణంలోని విజయనగర్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సింగర్ భాస్కర్ మంగళవారం అర్థరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. అస్వస్థతకు గురైన ఆయనను హుటాహుటిన ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతు తుదిశ్వాస విడిచినట్లు కుటుంబీకులు, స్థానికులు తెలిపారు. ప్రస్తుతం వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆయన అందరితో ఎంతో చనువుగా ఉండేవారని, సంగీత సాహిత్యాలు అంటే చాలా మక్కువగా ఉండేవారని కాలనీ వాసులు పేర్కొన్నారు. స్థానికంగా ఉన్న కవి, రచయిత అయిన హరీష్ శర్మ బృందంతో కలిసి ఎన్నో పాటలు పాడేవారని తెలిపారు. భాస్కర్‌కు భార్య, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఆయన మృతితో కాలనీ అంత శోకసంద్రంలో మునిగిపోయారు.

## స్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు కృషి

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** వైకుంఠధామాలలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ ఎండి.సాబేర్‌ఆలీ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ 1వ వార్డు పరిధిలోని కొండాపూర్ ఎస్‌సీ స్మశానవాటికను ఆయన స్థానిక కౌన్సిలర్ చందుపట్ల వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. స్నానాల గదుల నిర్మాణం పూర్తి చేసి 3 సంవత్సరాలు గడుస్తు ఒదని, ఒక వైపు మెయిన్‌రోడ్డుకు ప్రహారిగోడ నిర్మించి సంవత్సరం అవుతునా ్న నీటి వసతి కల్పించలేదని, బోరు వేయాలని కమీషనర్‌ను కోరారు. నీటి సమస్య పరిష్కరించి తగిన సౌకర్యాలు అందిస్తామని కమీషనర్ తెలిపారు. మాజీ సర్పంచ్ దక్కి రమేశ్, మాజీ ఎంపిటిసి చిల్కూరి గోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు సన్నీ, రాకేశ్, పర్యావరణ ఇంజనీర్ రాజేశ్, గణేశ్, మధు, నాయకులు ఇమ్మడి యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ పథకాలతో ఐటీ రంగం అభివృద్ధి

**-ఘనంగా జయంతి వేడుకలు..నేతల నివాళి**

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్‌లో మాజీ ప్రధానమంత్రి స ్వర్గీయ రాజీవ్‌గాంధీ 80వ జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు అమరేందర్ ఆధ్వర్యంలో రాజేశ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూళమాళలు వేసి నివాళులు అర్పించారు. రాజేశ్, అమరేందర్‌లు మాట్లాడుతూ రాజీవ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో టెలికాం విప్లవం, కంప్యూటరైజేషన్, ఓటింగ్ వయస్సు 21 నుంచి 18కి తగ్గింపు, పంచాయతీరాజ్‌ల సంస్థల ఏర్పాటు, విద్య ఆధునీకరణ తదితర సంక్షేమ పథకాలను అమలు చేశారని కొనియాడారు. రాజీవ్‌గాంధీ జయంతిని దేశవ్యాప్తంగా సద్భావనా దివస్‌లో భాగంగా అన్ని మతాలు, బాషల మధ్య జాతీయ సమైఖ్యత, మతసామరస్యం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గట్టగళ్ల రవి, మండల ప్రధానకార్యదర్శి మెట్టు నర్సింహ్మా, కిసాన్‌సెల్ అధ్యక్షులు బొంత రాజిరెడ్డి, మండల అధికార ప్రతినిధి ఓంప్రకాష్, సొసైటీ మాజీ డైరక్టర్ జవాజి సత్తయ్య, మాజీ వార్డుసభ్యులు బింగి యుగంధర్‌గౌడ్, నాయకులు పి.బసవయ్య, కె.కృష్ణ, జి.జంగయ్యాయాదవ్, బిల్లా సురేశ్, నాగులు, బి.కిషన్, పి.మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

**ఘణాపూర్ గ్రామంలో...**

ఘణాపూర్ గ్రామంలో కాంగ్రెస్ అధ్యక్షులు వేముల రాజుగౌడ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ 80వ జయంతిని నిర్వహించారు. పవర్‌గ్రిడ్ వద్ద జరిగిన కార్యక్రమంలో మేడ్చల్ బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేశ్‌గౌడ్ విచ్చేసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాళ వేసి నివాళులు అర్పించి ఆయన సేవలను కొనియాడారు. మాజీ సర్పంచులు నానావత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, వేముల పరమేశ్‌గౌడ్, మేడ్చల్ ఎస్‌టీ సెల్ అధ్యక్షులు నానావత్ సురేశ్‌నాయక్, ఎన్ఎస్‌యుఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఋణమాఫీపై రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కార్

**-మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి ఆరోపణ**



అధికారులతో చర్చిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, ఆగష్టు 21, ప్రభాతవార్త:** రైతులకు ఋణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దోబూచులాడుతుందని మాజీ ఎంపిపి ఏనుగు సుదర ్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో బుధవారం బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు-మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయాధికారి ఎం.ఎ.బాసిత్, సొసైటీ ఎండి రాహుల్‌రాజ్, రైతులతో ఋణమాఫీ అమలులో జాప్యం జరగడంపై చర్చించారు. సొసైటీలో ఋణాలు పొందిన 1,230 మంది రైతులకు సంబంధించి తొమ్మిది కోట్ల రుపాయలు మాఫీ చేయకుండా రెండు నెలలుగా ఆడిట్ అంటూ కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతులకు ఋణమాఫీ విషయంలో ఏలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని లేకుంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు. సొసైటీ డైరక్టర్లు జిల్లాల పోచిరెడ్డి, రేసు లక్ష్మారెడ్డి, చందుపట్ల ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దు :ఏవో

**జగదేవ్‌పూర్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ పథకంలో భాగంగా రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందవద్దని జగదేవ్‌పూర్ మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు అన్నారు. బుధవారం జగదేవ్‌పూర్ రైతు వేదికలో రుణమాఫీ కాని రైతుల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 డిసెంబర్ 12 నుండి 2023 డిసెంబర్ 9 లోపు పట్టా పాసుబుక్కుల ద్వారా పంట రుణాలు పొందిన రైతులు అందరు రుణమాఫీకి అర్హులని, వారందరికి ప్రభుత్వం రుణమాఫీ ఖచ్చితంగా చేస్తుందని అన్నారు. రుణమాఫీ కాని రైతులు ఎవరైనా ఉంటే ఆందోళన చెందకుండా వారి పట్టా పాసుబుక్కు, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు ఆయా గ్రామాల ఏఈఓలకు అందజేయాలన్నారు. అదేవిధంగా బ్యాంకులో రుణం పొందిన రైతులు బ్యాంక్ స్టేట్మెంట్‌ను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

## దుండగులను కఠినంగా శిక్షించాలి

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ మౌమితను అత్యంత అమానుషంగా అత్యాచారం చేసి హత్య చేసిన నేరస్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ టిపిటిఎఫ్ గజ్వేల్ జోన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ప్రదర్శన, కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిటిఎఫ్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్జీకర్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థినిని ఈనెల 9వ తేదీన అత్యంత దారుణంగా హింసించి, అత్యాచారం చేసి హత్య చేశారని, మహిళలకు ఎలాంటి రక్షణ కల్పించలేని పాలకుల, అధికార యంత్రాంగం యొక్క ఘోర వైఫల్యం మరొక సారి వెల్లడైందని అన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో, ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, నర్సుల ఉద్యోగ రక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ నాయకులు రామచంద్రం, రాజులు, విద్యాసాగర్, పాపిరెడ్డి, శంకర్, పర్వతం నర్సయ్య, రాజయ్య, తాళ్ల నాగరాజు, పిల్లి రాములు, మెట్టు రాములు, భాస్కర్, నర్సింలు, తుమ్మ సత్యం, శ్రీధర్, లక్ష్మయ్య, శ్రీనివాస్, కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

**డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను**

## కఠినంగా శిక్షించాలి : శాఖమూరి యాదగిరి

**నర్సాపూర్, ఆగస్టు 21, ప్రభాతవార్త :** కలకత్తాలో డ్యూటీలో ఉన్న డాక్టర్ పై అత్యాచారం, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని హోమియో దాసరి హక్కుల పోరాట సమితి మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాఖమూరి యాదగిరి డిమాండ్ చేశారు.

## ఆటో డ్రైవర్ పై ఖాఖీ జులూం..

**ఆటో డ్రైవర్ పై లాఠీ జులిపించిన డీఎస్పీ.. బోరున విలపించిన బాధితుడు**

**వికారాబాద్,ఆగష్టు 21, ప్రభాతవార్త:** ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటూ నీతులు చెప్పే అధికారులే సామాన్యులపై లాఠీ జులిపిస్తున్నారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఆటో డ్రైవర్‌పై బుధవారం ఓ పోలీస్ అధికారి లాఠీ జులిపించి చితకబాదారు. దీంతో తన చేయి విరిగి పోయిందంటూ బాధితుడు బోరున విలపించాడు. వివరాల్లోకి వెళ్ళితే..ధారూరు మండలం అల్లిపూర్ గ్రామానికి చెందిన నర్సిములు ప్రతినిత్యం వికారాబాద్-ధారూరు మార్గంలో ఆటో తోలుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. యధావిధిగా బుధవారం ఉదయం ఎన్టీఆర్ చౌరస్తాలో ఆటోను క్యూ లైన్లో నిలుపుకొన్నాడు. నిలిపి ఉన్న ఆటోలో ధారూరు వైపుగా వెళ్ళే ప్రయాణికులు ఒక్కొక్కరుగా ఎక్కి కూర్చొన్నారు. అటుగా వచ్చిన వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ వాహనంలోంచి దిగి ఆటో డ్రైవర్ నర్సిములు ను లాఠీ తో చితక బాదారు. దీంతో నర్సిములు చేయి కి తీవ్ర గాయం కావడంతో బోరున విలపించాడు. అక్కడే ఉన్న స్థానిక జనం పోలీసు అధికారి తీరును తప్పు పట్టారు. నర్సిములు ను అకారణంగా వచ్చి చితక బాధడం సరైంది కాదని మండిపడ్డారు. నర్సిములు సైతం పోలీసు అధికారి తీరుపై ఏడుస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రెండ్లీ పోలిసింగ్ అంటే సామాన్యులను కొట్టడమే నా అంటూ...సంఘటన చూసిన వారు పోలీసుల తీరును తప్పు పట్టారు.

**సంఘటన పై విచారణ చేసి బాధితుడికి న్యాయం చేస్తాం**

**జిల్లా ఎస్పీ పి.నారాయణరెడ్డి**

ఆటో డ్రైవర్ ను డీఎస్పీ ఉద్దేశ పూర్వకంగా కొట్టలేదని, అటుగా అసెంబ్లీ స్పీకర్ కాన్వాయ్ వస్తున్నందున ట్రాఫిక్ క్లియరెన్సులో భాగంగా కొట్టి ఉంటారని జిల్లా ఎస్పీ పి.నారాయణరెడ్డి తెలిపారు. ఆటోలో పరిమితి కి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న కారణంగా ఆటో డ్రైవర్‌ను డీఎస్పీ కొట్టినట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఈ విషయమై తగు విచారణ జరిపి బాధితుడికి న్యాయం జరిగేలా కృషి చేస్తామని ఎస్పీ వివరణ ఇచ్చారు.

## షాద్‌నగర్‌లో బంద్ విజయవంతం



**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఆగస్టు 21) :** ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను నిరసిస్తూ.. పలు సంఘాలు ఇచ్చిన భారత్‌బంద్ పిలుపు నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా షాద్‌గనర్‌లో బంద్ విజయవంతమైంది. ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలో బుధవారం నిరసన , ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. వర్గీకరణ పోరాట సమితి సభ్యులు మహేష్ మాల, పోరాట సమితి నాయకులు సవాళ్ళ వినోద్, సవాళ్ళ రామచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ.. అంబేద్కర్ఆశయాలకు తూట్లు పొడుస్తూ.. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును నిరసిస్తున్నామని తెలిపారు. ఎస్సీల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందే ఉద్దేశ్యం ఏమైనా ఉంటే ఈ విషయంపై పూర్తి సమాచారాన్ని అందజేయాలని సవాల్ విసిరారు. సుప్రీంకోర్టు తీర్పును ఏడుగురు న్యాయమూర్తులు ఏర్పాటు చేసిన బెంచ్ తీర్పును తాము విశ్వసించడం లేదని పేర్కొన్నారు. తీర్పును పున:పరిశీలన చేయాలని వారు డిమాండ్



చేశారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణంలో వ్యాపార కార్యకలాపాలను బంద్ చేయించారు. ఆర్టీసీ డిపోలో బస్సులను నిలిపివేశారు. దళితులకు సమన్యాయం కావాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు.

## ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

**మర్కుక్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామరకుంట లో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు పత్తి నర్సింలు ఆధ్వర్యంలో బుధవా రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీతో రైతుల కళ్లలో ఆనందం నింపిన రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎంతో బాగున్నాయని కొనియాడారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను కలిసినట్లయితే పూర్తి వివరాలు అందిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వనం ఆంజనేయులు యాదవ్, పత్తి ఆంజనేయులు, పత్తి శంకర్, ఐలేని, కటికె బాబు, బి.కిష్టయ్య, వి.స్వామి, ఎండి.ఖలీల్, సత్యనారాయణ, బక్కల్ రాజు, బాలరాజు, బి.కుమార్, సంఘం నర్సింలు, దేవి రమేష్, జిట్ట బాలచందర్, బక్క యాదగిరి, యువజన కాంగ్రెస్ గ్రామఅధ్యక్షుడు శ్యాంప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌యాదవ్, సోషల్ మీడియా ఇంచార్జ్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కర్కపట్లను సందర్శించిన మర్కుక్ ఎస్ఐ

**మర్కుక్, ఆగస్టు 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని కర్కపట్ల గ్రామంలో బుధవారం మర్కుక్ ఎస్ఐ దామోదర్ పోలీసు సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాలను, కంపెనీల పరిసరాలను పరిశీలించి గ్రామస్తులకు, కంపెనీలలో పనిచేసే కార్మికులకు గంజాయి, సిసి కెమెరాలపై అవగాహన కల్పించారు. అనం తరం ఎస్ఐ దామోదర్ మాట్లాడుతూ గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాలు, ప్రభుత్వం నిషేదించిన గుట్కాలు ఎవరైనా తీసుకున్నా, అమ్మి నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లయితే పోలీసులకు తెలుపాలన్నారు. కంపెనీలలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులను చేర్చుకున్నట్లయితే వారి ఆధార్, పూర్తి వివరాలను సేకరించి పనిలో పెట్టుకోవాలని సూచించారు. అలాగే పరిశ్రమల్లో, గ్రామంలోని ప్రధాన కూడళ్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సిసి కెమెరాలు ఉండడం వల్ల దొంగతనాలు, నేరాలు తగ్గుతాయని తెలిపారు.

## నేటి ధర్నాను విజయవంతం చేయాలి

**-బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణాగౌడ్**

**శివ్వంపేట, ఆగస్టు 21 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణాగౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆదేశాలతో నేడు మండల కేంద్రమైన శివ్వంపేట సహకార సంఘం భవనం వద్ద ఉదయం 10 గంటలకు రైతులకు ఎలాంటి షరతలు లేకుండా రుణమాఫీ మొత్తం చేయాలనే డిమాండ్‌తో ధర్నా కార్యక్రమం ఉంటుందని, ధర్నా కార్యక్రమానికి మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పీటీసీ పబ్బా మహేష్‌గుప్త ధర్నా కార్యక్రమానికి వస్తున్నారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఒక ప్రకటనలో ఆయన తెలిపారు.

## తహసీల్దార్ జ్ఞానజ్యోతికి సన్మానం

**వెల్దుర్తి, ఆగస్టు 21 ప్రభాతవార్త:** ఉత్తమ స్పెషల్ ఆఫీసర్ అవార్డు అందుకున్న మాసాయిపేట మండల తహశీల్దార్ జ్ఞానజ్యోతిని బుధవారం ఎమ్మార్పీఎస్ నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షులు మాసాయిపేట యాదగిరి మాదిగ, తాజా మాజీ సర్పంచి మధుసూదన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాసాయిపేట తహశీల్దార్‌గా పనిచేస్తున్న జ్ఞానజ్యోతికి ఉత్తమ స్పెషల్ ఆఫీసర్ అవార్డు రావడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఇలాంటి ఉత్తమ అవార్డు అందుకోవడం పట్ల గ్రామస్థులు, నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధికారి వినోద్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు నరేష్ మాదిగ, షరత్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.